
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జిల్లా అంతా పేదలే..!

జిల్లా అంతా పేదలే.. నమ్మశక్యంగా లేదా.. ఇది ముమ్మాటికీ నిజం. గత వైసీపీ ప్రభుత్వం ఓటు రాజకీయాలకు దిగింది. పేదల ఆర్థిక భరోసాకు అందించే పథకాలపై పాలనాపరమైన పట్టు కోల్పోయింది. ఉచితాలంటూ జగన్ ప్రభుత్వం ఆసరా, అమ్మఒడి, పింఛన్ లాంటి క్యాష్ పథకాలను అమలుచేసింది. ఉచితంగా డబ్బులు వచ్చే ఈ పథకాలకు జనం అర్రులు చాచారు. కొందరు ఉద్యోగులు, పన్నులు కట్టేవాళ్లు, భూస్వాములు, పెన్షనర్లు పేదల కడుపు కొట్టేందుకు నిరుపేదలుగా మారారు. పథకాల కోసమే నిరుపేదల అవతారం ఎత్తారు. దీంతో పేద, ధనిక తేడా లేకుండా జిల్లాలో పథకాలను 90-93 శాతం మందికి పైగా ప్రజలు అందుకుంటున్నారు.



- పేదల సంక్షేమాలు పెద్దలపాలు
- వైసీపీ పాలనలో అనర్హులకు పెద్దఎత్తున తెల్లరేషన్ కార్డులు
- మళ్లీ కొత్త కార్డులకు 20 వేలకు పైగా దరఖాస్తులు
- ఏరివేత చేపడితే..
- 50 వేలకు పైగా తెల్లరేషన్‌కార్డులు తొలగే అవకాశం

కడప కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూలీనాలీ చేసే పేదలకు చెందాల్సిన ఉచిత ప్రభుత్వ పథకాలను ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న పెద్దలు సైతం నిరుపేదలుగా మారి అందుకోవడం గత వైసీపీ ప్రభుత్వంలో పాలన గాడి తప్పింది అనేందుకు నిదర్శనం. గత ప్రభుత్వంలో ఉదాసీనంగా రేషన్ కార్డులు, పింఛన్ పథకాలు పంచినట్లు చంద్రబాబు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని కొన్ని గ్రామాల్లో అధికారులు చేపట్టిన సర్వేలో ఇంతవరకు పంపిణీ జరుగుతున్న పింఛన్లలో 5 నుంచి 10శాతం బోగస్‌గా బయటపడుతున్నాయి. ఈ లెక్కన జిల్లాలో ఉన్న 5.78 లక్షల తెల్ల రేషన్ కార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దాదాపు 50 వేలకు పైగా కార్డులు రద్దయ్యే అవకాశం ఉందంటున్నారు.

జిల్లాలో ప్రస్తుత గణాంకాల ప్రకారం 7 లక్షల కుటుంబాల్లో 22.50 లక్షల జనాభా ఉంది. అందులో తెల్లరేషన్ కార్డులు 5.78లక్షల మందికి ఉన్నాయి. ఒక్కో కార్డుపై సగటున ఒక కుటుంబంలో ముగ్గురిగా లెక్కించినా 18 లక్షల మందికి రూపాయి బియ్యం మొదలు ఇతర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వంలో అర్హులైన పేదలకు తెల్లరేషన్ కార్డులు ఇచ్చేందుకు ఇప్పటికే రెవెన్యూ కార్యాలయాలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ నెల 28 వరకు కొత్తగా రేషన్ కార్డులకు దరఖాస్తులు కోరింది. ఎన్నికల నోటిఫికేషన్ సమయానికి సుమారు 18 వేల దరఖాస్తులొచ్చాయి. మళ్లీ ఇప్పుడు కొత్తగా 4 వేల వరకు వచ్చినట్లు తెలుస్తోంది. గడువు నాటికి దరఖాస్తుల సంఖ్య 25 వేలకు దాటొచ్చంటున్నారు. వీళ్లందరు ఎంక్వయిరీలో పేదలని తేలితే ఇప్పుడున్న 18 లక్షల మందికి తోడు మరో లక్ష మంది పేదలుగా మారుతారు. అంటే జిల్లాలో ఉండే జనాభా 22.50 లక్షలలో 19లక్షల మంది పేదలంటే.. మన జిల్లాలో ఇంత పేదరికం తాడవిస్తోందా? అని పాలకులు, అధికారులు నోరు వెళ్లబెడుతున్నారు.

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాత్రతోనే..

వైసీపీ హయాంలో ప్రతి 50 కుటుంబాలకు ఏర్పాటు చేసిన జగనన్న వలంటీర్లు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారు. రూ.5వేల జీతంతో పొట్ట పోసుకోవడం కష్టంగా మారడంతో పేదల పథకాలను అనర్హులకు కట్టబెట్టేందుకు అడ్డదారులు తొక్కారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.10-20 వేలు లంచాలు తీసుకుని తెల్ల రేషన్‌కార్డులను ధనిక వర్గాలకు కట్టబెట్టారనే విమర్శలు ఉన్నాయి. గ్రామ సచివాలయ వ్యవస్థ కూడా వీరి రెకమెండేషన్‌కు మద్దతు పలకడంతో జిల్లాలో తెల్లకార్డులు 50 వేలకు పైగా అనర్హులకు అందాయని అంటున్నారు. అనర్హులకు తెల్లకార్డులు ఇప్పించి అడ్డగోలుగా పథకాల దోపిడీకి దిగారనే విషయం ఇపుడిపుడే అధికారుల పరిశీలనలో వెలుగు చూస్తోంది.



తెల్ల రేషన్‌కార్డు పొందాలంటే..

తెల్ల రేషన్‌కార్డు పొందాలంటే ప్రభుత్వాలు సిక్స్ స్టెప్ ఫార్ములాను ఉపయోగిస్తోంది. 300 యూనిట్ల కరెంట్ వాడకం మించకూడదు. 3 ఎకరాల మాగాణి భూములు పైబడిన వారు, 10 ఎకరాల వరకు మెట్ట భూములు ఉన్న రైతులు, ఇన్‌కంటాక్సు చెల్లించే వారు, ఫోర్ వీలర్ ఉన్న వారు తెల్ల రేషన్ కార్డులు పొందేందుకు అనర్హులు. ఏటా రూ.1.20లక్షల ఆదాయంతో పేదరికానికి దిగువ ఉన్నవారిని తెల్లకార్డులకు అర్హులుగా గుర్తిస్తారు. భూస్వాములు, 20 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 19 వేలమంది రిటైర్డ్ ఉద్యోగులు, ఇన్‌కంటాక్స్ కట్టే వ్యాపారులు, కువైత్, దుబాయ్ లాంటి ఇతరదేశాల్లో పని చేస్తూ ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలు లక్షలాదిమంది జిల్లాలో ఉన్నారు. వీరిలో చాలామందికి తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉచిత పథకాలు అమ్మఒడి, ఆసరా, ఫీజురీయింబర్సుమెంట్, పేదలకు ఇళ్లు, పింఛన్లు, లక్షలాది విలువ చేసే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను ప్రవేశ పెట్టి పప్పులు బెల్లాల్లా పంచి పెట్టే కార్యక్రమం చేపట్టింది. దీంతో జిల్లాలో ఉచిత పథకాలకు ఆశపడి అడ్డదారుల్లో 10-13 శాతం మంది తెల్లరేషన్ కార్డులు పొందారు. ఇదే ఇప్పుడు ప్రభుత్వానికి ఆర్థికభారంగా మారింది.

బియ్యం మాఫియాకు వీరే కారణం

ఆహార భద్రత చట్టం కింద జిల్లాలో ప్రస్తుతం 5.86 లక్షల మంది పేదలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. అందు లో గత ప్ర భుత్వ హయాంలో తప్పుడు విధానాలతో ఉచిత పథ కాలకోసం 10-13 శాతం మంది తెల్లరేషన్ కార్డులు పొందినట్లు విమర్శలు ఉన్నాయి. వీరు రూపాయి బియ్యం తినకపోవడంతో వాటిని దళారులకు అమ్మకాలు చేస్తున్నారు. నెలకు 8812 వేల టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుండగా అందులో 35-40 శాతం అంటే 3.2 వేల టన్నుల బియ్యం బయట రాష్ట్రాలకు తరలిపోతోందని తెలుస్తోంది. కాగా జిల్లాలో విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ తనిఖీల్లో ఎక్కడ చూసినా టన్నుల కొద్ది రేషన్‌బియ్యం పట్టు పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రేషన్ బియ్యం మాఫియాపై ఉక్కుపాదం మోపింది. ఈ నేపథ్యంలో జిల్లాలో అనర్హులను గుర్తిస్తే దాదాపు 50 వేల రేషన్ కార్డులు తొలగించ వచ్చని అంటున్నారు. ఇదే జరిగితే అప్పుడు నిజమైన పేదలకు మాత్రమే ఉచిత లబ్ధి అందుతుంది. లేదంటే పేదలకోసం పెట్టిన పథకాలు పక్కదారి పట్టడం ఆగదు.

పరిటాల రవి హత్య కేసులో..
బెయిలుపై నలుగురు విడుదల



కడప సెంట్రల్ జైలు నుంచి బెయిలుపై బయటకు వస్తున్న పరిటాల రవి హత్య కేసు నిందితులు

కడప క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత పరిటాల రవి 2005 జనవరి 25న అనంతపురంలో హత్యకు గురయ్యారు. ఈ కేసులో 12 మందికి శిక్ష పడింది. నలుగురు కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. వీరికి హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. దీంతో నలుగురు బెయిలుపై శుక్రవారం కడప కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు. వీరి విడుదల సందర్భంగా కుటుంబ సభ్యులు కడప కేంద్ర కారాగారానికి చేరుకున్నారు. విడుదలైన వారిని వాహనాల్లో ఎక్కించుకుని సొంతూర్లకు వెళ్లారు.

పరిటాల రవి హత్య కేసులో 12 మందిపై కేసు నమోదు కాగా వీరిలో ఇప్పటికే మద్దెల చెరువు సూరి, మొద్దు శీను, కొండారెడ్డి, పటోళ్ల గోవర్ధనరెడ్డి చనిపోయారు. ఆరు నెలల క్రితం వన్న హనుమంతురెడ్డి, వడ్డె శీను, పెద్దిరెడ్డి బెయిలుపై బయటకు వచ్చారు. ప్రస్తుతం కడప సెంట్రల్ జైలు నుంచి నారాయణరెడ్డి, ఓబిరెడ్డి, రంగనాయకులు, వడ్డె కొండ విడుదలయ్యారు. అలాగే వైజాగ్ సెంట్రల్ జైలులో ఉన్న రేఖమయ్య కూడా విడుదల అయ్యారు. వీరంతా ప్రతి సోమవారం పోలీసుస్టేషనులో హాజరు కావాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా బెయిలుపై వచ్చిన వారిని మీడియా పలకరించే ప్రయత్నం చేయగా నారాయణరెడ్డి స్పందిస్తూ హైకోర్టు ఉత్తర్వులమేరకు ఈ విషయాలపై స్పందించబోమంటూ కారు ఎక్కి వెళ్లిపోయారు. అయితే 18 ఏళ్ల తరువాత బెయిలుపై విడుదలయ్యారంటూ వారి బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పగవాడికి కూడా ఇలాంటి కష్టాలు ఉండకూడదంటూ వారి బంధువులు ఆవేదనతో చెప్పుకొచ్చారు.

ఆకాంక్షల జిల్లా
లక్ష్య సాధనకు కృషి చేయాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్ డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను జిల్లాలో సమర్థవంతగా అమలు చేసి ఆకాంక్ష జిల్లా లక్ష్య సాధనకు కృషిచేయాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయా జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంబంధిత కలెక్టర్లతో నీతి అయోగ్ సీఈఓ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సామాజిక స్థాయిని, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకు రావడంలో పురోగమనంలో ఉన్నామన్నారు. సంబంధిత శాఖలు అన్ని పారామీటర్లలో 100శాతం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఆకాంక్ష బ్లాకుల లక్ష్య సాధనలో భాగంగా సీకే దిన్నె, జమ్మలమడుగు మండలాల్లో అన్నిరకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జడ్పీ సీఈఓ ఓబులమ్మ పాల్గొన్నారు.

26 నుంచి కేంద్ర మంత్రి పర్యటన

జిల్లాలో జరుగుతున్న ప్రగతిపై సమీక్షించేందుకు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ తెలిపారు.ఈనెల 26 నుంచి 28 వతేదీ వరకు మూడు రోజులు సీకే దిన్నె, పెండ్లిమర్రి, జమ్మలమడుగు మండలాల్లో క్షేత్ర స్థాయిలో జరిగిన జరుగుతున్న పనులను ఆయన పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖాధికారులు నాగేశ్వరరావు, డాక్టర్ నాగరాజు మీనాక్షి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వర్సెస్ వైసీపీ

- ఆడిటోరియం లీజును అడ్డుకున్న కమిటీ

(కడప-ఆంధ్రజ్యోతి): ఓడలు బండ్లు అవుతాయి, బండ్లు ఓడలవుతాయంటే ఇదేనేమో. ఎలాగంటే దాదాపు 15 ఏళ్లగా కార్పొరేషన్‌లో అప్పటి కాంగ్రెస్ ఇప్పటి వైసీపీ ఆడిందే ఆట పాడిందే పాటగా సాగింది. కార్పొరేషన్ అవతరించిన తరువాత తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి మేయరుగా ఎన్నిక కాగా తరువాత నుంచి వరుసగా ప్రస్తుత మేయరు సురేశ్‌బాబు పనిచేస్తున్నారు. ప్రతిసారి అప్పట్లో కాంగ్రెస్, అనంతరం వైసీపీకి పూర్తి పాలకవర్గం ఉండేది. దీంతో తమకు ఎదురులేదు అనేలా సాగుతూ వచ్చింది. ప్రతి బిల్లును వన్‌సైడ్‌గా చేసుకునేవారు. 2014-19 రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా కడప కార్పొరేషన్‌లో వైసీపీ పాలకవర్గానిదే పైచేయి అయింది. ఈసారి సీన్ మారింది. చాలా ఏళ్ల తరువాత అంటే.. 1999ఎన్నికల తరువాత టీడీపీ ఎమ్మెల్యేగా ఆర్.మాధవి గెలిచారు. తొలి మూడునెలలు సాఫీగా జరిగిన కడప పాలిటిక్స్ ఇప్పుడు నువ్వా నేనా అన్నట్లుగా మారాయి. ఇప్పటికే వైసీపీ నుంచి 8 మంది కార్పొరేటర్లు టీడీపీ గూటికి చేరారు. మరో 12 మంది చేరతారంటూ టీడీపీ శిబిరం చెబుతోంది. ఈ నేపథ్యంలో కడపలోని వైఎస్సార్ ఆడిటోరియం కోసం నిర్వహించిన టెండరును మేయరు సురేశ్‌బాబు నేతృత్వంలోని స్టాండింగ్ కమిటీ రద్దు చేయడం టీడీపీ వైసీపీ మధ్య వార్‌గా మారింది.

వైఎస్సార్ ఆడిటోరియంను కడప కార్పొరేషన్ నిర్వహిస్తూ వస్తోంది. నిబంధనల ప్రకారం ప్రతి యేటా ఓపెన్ టెండరు నిర్వహించాల్సి ఉంది. అయితే గత మూడేళ్లుగా ఏడాదికి రూ.9లక్షలు, రూ.11 లక్షలు, రూ.12 లక్షలు.. అంటే రూ.2లక్షల చొప్పున పెంచుతూ నామినేషన్‌పై ఇచ్చారు. ఈసారి కార్పొరేషన్ అధికారులు ఓపెన్ టెండరు నిర్వహించి ఈఎండీ అమౌంటు రూ.5లక్షలుగా నిర్ణయించారు. ఇద్దరు టెండరులో పాల్గొన్నారు. కార్పొరేషన్ అధికారులు గత ఏడాది నామినేషన్ ఇచ్చిన రూ.12.20 లక్షల నుంచి వేలం పాట ప్రారంభించారు. ఈ.చైతన్య, కె.ఉషారాణి వేలంలో పాల్గొన్నారు. చైతన్య రూ.14లక్షల 20వేల పైచిలుకు టెండరు వేశారు. ఓపెన్ టెండర్లలో ఇతనే ఎక్కువ కావడంతో నిబంధనల ప్రకారం ఇతనికి ఇవ్వాల్సి ఉంది. దీన్ని ఈనెల 5న స్టాండింగ్ కమిటీకి పంపించారు. మూడు రోజుల క్రితం మేయరు సురేశ్‌బాబు నేతృత్వంలో జరిగిన ఆడిటోరియం స్టాండింగ్ కమిటీలో దీన్ని రద్దు చేస్తూ తీర్మానం చేశారు. గత ఏడాది కన్నా రూ.రెండులక్షలకు పైగా ఎక్కువగా కోట్ చేసి టెండరు దక్కించుకుంటే ఆమోదం తెలపకుండా రద్దు చేస్తూ తీర్మానం చేయడం విమర్శలకు తావిచ్చింది. స్టాండింగ్ కమిటీలో మేయరుతో పాటు మరో ఐదుగురు సభ్యులుంటారు. గతంలో కన్నా రెండులక్షల పైచిలుకుతో ఎక్కువకు పాడినా రద్దు చేయడాన్ని స్టాండింగ్ కమిటిలో ఓ సభ్యుడు జీర్ణించుకోలేక వాకౌట్ చేసి బయటికి వచ్చారు. ఎందుకిలా జరిగిందంటే.. వైఎస్సార్ ఆడిటోరియంను వేలంలో దక్కించుకున్న మాజీ కార్పొరేటరు చైతన్య ప్రస్తుతం టీడీపీలో ఉన్నారు. ఈ కారణంగానే టెండరును రద్దు చేశారనే చర్చ సాగుతోంది. ఈ వ్యవహారం టీడీపీ, వైసీపీల మధ్య వార్‌గా మారింది. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ నేతలు పేర్కొన్నారు.

వైసీపీలో బుజ్జగింపుల పర్వం

- నేడో రేపో కార్పొరేటర్లతో ఎంపీ అవినాశ్ భేటీ

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఘోర ఓటమి నుంచి జగన్ అండ్ కో తేరుకోక ముందే కార్పొరేషన్‌కు చెందిన పలువురు వైసీపీ కార్పొరేటర్లు సైకిలెక్కేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో 8 మంది సైకిలెక్కేశారు. మరో పది 12 మంది రెండో విడతలో పచ్చ కండువా కప్పుకుంటారన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో సొంత జిల్లాలో కార్పొరేటర్లను కాపాడుకునేందుకు బుజ్జగింపు ప్రయత్నాలు మొదలుట్టారు. ఈ బాధ్యతను ఎంపీ అవినాశ్ రెడ్డికి అప్పగించినట్లు చెబుతారు. ఇప్పటికే ఆయన అసంతృప్త కార్పొరేటర్లతో ఓమారు మీటింగ్ పెట్టారు. అయినా ఏడుగురు టీడీపీలోకి జంప్ అయ్యారు. అవినాశ్ పార్లమెంటు సమావేశాల్లో ఢిల్లీలో ఉన్నారు. శనివారం జగన్ పుట్టినరోజు. దీన్ని ఓ వేడుకగా జరపాలని వైసీపీ భావిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా పుట్టినరోజు వేడుకలతో పాటు కార్పొరేటర్లు టీడీపీలోకి వెళ్లకుండా మరోసారి బుజ్జగించాలని జగన్ సూచనల మేరకు అవినాశ్‌రెడ్డి జిల్లాకు వస్తున్నట్లు సమాచారం. శని లేదా ఆదివారాల్లో మరోసారి కార్పొరేటర్లతో సమావేశమై బుజ్జగిస్తారని అంటున్నారు.

రెండురోజుల క్రితం ఐదుగురు అసంతృప్త కార్పొరేటర్లు మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా నేతృత్వంలో తాడేపల్లిలోని జగన్‌ను కలిశారని అంటున్నారు. ఈ సందర్భంగా జగన్ మైనార్టీకి చెందిన కార్పొరేటర్లను పార్టీని వీడొద్దు, భవిష్యత్తు మనదే అంటూ భరోసా ఇచ్చారని సమాచారం. ఇప్పుడు అవినాశ్‌రెడ్డి మరోసారి కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయనుండటం వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. ఎవరు ఎప్పుడుంటారో, ఎప్పుడు పార్టీ మారుతారో తెలియడంలేదంటూ ఓ సీనియర్ కార్పొరేటరు అనడం గమనార్హం.

రేపు జిల్లాకు ఇద్దరు మంత్రుల రాక

కడప కలెక్టరేట్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి దుర్గేశ్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు మద్రాసు రోడ్డులోని మేడా కల్యాణ మండపంలో జరిగే ప్రజా ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. 3 గంటలకు సిద్ధవటం కోటను సందర్శిస్తారు. 5-30 గంటలకు కడప రైల్వేస్టేషన్ నుంచి రైలులో రాజమండ్రికి బయలుదేరి వెళతారు. అలాగే మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం ఉదయం గండికోట డ్యాంను పరిశీలిస్తారు. అనంతరం కడప చేరుకుని మేడా కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం కడప రైల్వే స్టేషన్ నుంచి రైలులో విజయవాడకు బయిలుదేరి వెళతారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సమాచారం అందింది.

మేకల మందపై చిరుత దాడి

- ఒక మేక మృతి
- కనిపించని ఐదు జీవాల జాడ
- కుక్కల సాయంతో ప్రాణాలతో బయటపడ్డ కాపరి

వివరాలు... 6లో..

తీరనున్న పులివెందుల దాహార్తి

రాష్ట్ర ప్రభుత్వం పులివెందుల వాటర్ గ్రిడ్ పనులను కొనసాగించేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం మారడంతో రూ.480కోట్ల పనులు మధ్యలోనే ఆగిపోతాయని అందరూ భావించారు. కానీ అభివృద్ధి పనులు అభివృద్ధి పనులే, రాజకీయం రాజకీయమే అన్నట్లు కూటమి ప్రభుత్వం ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో భాగంగా పనులు కొనసాగించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. 50శాతం పనులు ఇప్పటికే పూర్తి కాగా మరో 50శాతం పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. దీంతో పులివెందుల వాటర్ గ్రిడ్ పనులు పరుగులు పెట్టనున్నాయి.



పులివెందుల సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

- జగన్ హయాంలో రూ.480 కోట్లతో పనులు
- ఎన్నికల నాటికి కేవలం 50శాతం మాత్రమే పూర్తి
- ఆగిన పనులు కొనసాగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- పనులు సాగుతాయో లేదో అనే అనుమానానికి చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న పులివెందుల నియోజకవర్గ ప్రజలు

పులివెందుల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించడమే లక్ష్యంగా రూ.480కోట్లతో పనులు ప్రారంభించారు. పులివెందుల నియోజకవర్గంలోని పులివెందుల, వేంపల్లె, వేముల, లింగాల, తొండూరు, సింహాద్రిపురం, చక్రాయపేట మండలాలకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి అక్కడ నీటిని శుద్ధి చేసి పైప్‌లైన్ల ద్వారా ఆయా గ్రామాల్లోని వాటర్ ట్యాంకులకు నీరందించాలని నాటి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. 2020 చివరలో వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టారు. రూ.480 కోట్లతో 299 గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు పెట్టుకున్నారు. అందులోను 199 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించాలనుకున్నారు. అలాగే 278 కిలోమీటర్ల మేర ప్రధానపైప్ లైన్, 889 కిలోమీటర్ల మేర హెచ్‌డీ పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పనులను 2020లో ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఈ పనులన్నీ పూర్తయితే పులివెందుల నియోజవకర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందనుంది. కానీ ఈ పనులు అనుకున్నంత వేగంగా వైసీపీ ప్రభుత్వం చేయలేదని చెప్పాలి. ఈ ఏడాది ఎన్నికల నాటికి 50శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఇక పనులు ఆగిపోతాయని అందరూ భావించారు. కానీ కొత్త ప్రభుత్వం పనులు కొనసాగించాలని నిర్ణయం తీసుకోవడంతో పులివెందుల నియోజకవర్గ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.



సీబీఆర్ వద్ద నిర్మాణంలో ఉన్న నీటిశుద్ధి కేంద్రం వ్యూ

పనులు ఏమేరకు జరిగాయంటే..

299 గ్రామాలకు అందించాల్సిన వాటర్‌గ్రిడ్ పనులు జూన్ నాటికి 50శాతం పూర్తి చేశారు. దాదాపు రూ.200కోట్ల మేర బిల్లులు కూడా చెల్లింపులయ్యాయి. వాటర్ గ్రిడ్‌లో భాగంగా 199 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేయాల్సి ఉంటే అందులో 188 ట్యాంకుల పనులు పూర్తయ్యాయి. ప్రధాన పైప్‌లైన్ 278 కి.మీకు గాను కేవలం 85 కి.మీ మేర పూర్తయ్యాయి. అలాగే హెచ్‌డీ పైప్‌లైన్ 889 కి.మీ మేర ఏర్పాటుచేయాల్సి ఉండగా దాదాపు 700 కి.మీ పనులు పూర్తయినట్టు అధికారిక లెక్క. అలాగే చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) సమీపంలో నీటిశుద్ధి కేంద్రం పనులు దాదాపు 85శాతం పూర్తయ్యాయి. అంటే ఈ పనులను బట్టి చూస్తే ప్రధాన పైప్‌లైన్ పూర్తయితేనే గ్రామాలకు తాగునీరు అందనుంది. ప్రధాన పైప్‌లైన్ మినహా మిగిలిన పనులన్నీ దాదాపు 70 నుంచి 80శాతం మేర పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం పులివెందుల వాటర్ గ్రిడ్ పనులు పూర్తిచేయించేందుకు నడుం బిగించడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తప్పుడు పత్రాలతో కబ్జా చేశారు

● కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గాలివీడుకు చెందిన ప్రజలు

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోర్టులో కేసు నడుస్తున్నా తమ భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేసేందుకు యత్నిస్తున్నారంటూ ఓ వృద్ధురాలు శుక్రవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. గాలివీడు గ్రామానికి చెందిన హుస్సేన్‌సాబ్‌కు అదే గ్రామంలోని సర్వే నంబరు 475లోని భూమిపై 456/88 నంబరుతో ప్రభుత్వం డీకేటీ పట్టా జారీ చేసింది. ఆయన మరణానంతరం ఆయన భార్య షేక్ షంషాద్ (73) ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవించేది. 2022 అక్టోబరు 22వ తేదీ రాత్రి వేళలో షేక్ అహ్మద్‌బాషా, షేక్.జిలానీబాషా ఆ భూమిలోని పైరును దున్నేసి కబ్జా చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ఈ విషయంపై ఆర్‌వోఆర్ కోర్టులో కేసు కూడా నడుస్తోందని, అయినా, ఆ భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేసేందుకు తహసీల్దార్ చూస్తున్నాడని అర్జీలో పేర్కొన్నారు. ఈ విషయంపై కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన అనంతరం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

15 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● ఐదుగురు కూలీల అరెస్టు

రాజంపేటటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేట మండల పరిధిలోని అనంతసముద్రం సమీపంలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 15 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎస్.సుధాకర్ తెలిపారు. శుక్రవారం రాజంపేట పట్టణంలోని రూరల్ పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పీఎస్ రాజ్‌కుమార్, ఎస్‌బీవో పోలీసు సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించి రూ.5 లక్షల విలువైన దుంగలు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూరల్ సీఐ డీవీ రమణ, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు. అరెస్ట్ చేసినవారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు.

మంచు మాటున ప్రమాదం

● వేకువజామున ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం

● జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా గమ్యం చేరవచ్చు



రహదారుల్లో కమ్ముకున్న పొగమంచు

బద్వేలు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా చలికి జనం గజగజ వణుకుతున్నారు. చలి మాత్రమే కాదు.. విపరీతమైన పొగమంచు కమ్ముకుంటోంది. గతంలో తెల్లవారుజామున పొగమంచు వచ్చేది. ఇప్పుడు పగలంతా మంచు ఉంటోంది. ముఖ్యంగా తెల్లవారు జామున నాలుగుగంటల నుంచి ఉదయం 8గంటల వరకు దట్టమైన పొగమంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చలితీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. సాయంత్రం చీకటి పడకముందే చలి మొదలవుతోంది. ముఖ్యంగా వాహన చోదకులు చలితో ఇబ్బందులు పడుతున్నారు.

అసలే రహదారులు అంతంత మాత్రంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణరోడ్లు, పల్లె కూడళ్ల వద్ద మలుపులు, ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించే పరిస్థితి లేకపోవడంతో ఇలాంటిచోట్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల కొన్ని రహదారుల్లో ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. అయితే వాహనచోదకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో పొగమంచులో ప్రయాణాలు చేసే వారికి పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు.

మంచుతో ప్రమాదం

- దట్టంగా మంచు కమ్ముకోవడం వలన వాహనదారులు రహదారిని అంచనా వేయలేరు. దారి సరిగా కనిపించదు.
- మంచు కారణంగా రోడ్డు చెమ్మగా ఉండటంతో వాహనాలు వేగంగా నడిపే క్రమంలో అదుపుతప్పే అవకాశం ఉంది.
- కొందరు ప్రధాన రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తుంటారు. అదే మార్గంలో వచ్చే వాహనచోదకులు పొగమంచు కారణంగా వాటిని గుర్తించలేక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.
- దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లకు సరైన విశ్రాంతి, నిద్రలేక వేకువజామున చల్లగాలులకు కునుకుపడుతోంది. దీనికి తోడు పొగమంచు కారణంగా ఎదురుగా వాహనాలు సమీపంలోకి వచ్చేవరకు గుర్తించలేకున్నారు. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- కొందరు తెల్లవారుజామునే లేచి రహదారుల్లో జాగింగ్, వాకింగ్ చేస్తున్నారు. పొగమంచు కారణంగా వీరిని వాహనచోదకులు గుర్తించే అవకాశం లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత సీజన్‌లో పొగమంచు కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికం. ఈ క్రమంలో రహదారుల్లో నిత్యం వాహన చోదకులకు భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులకు స్టిక్కర్లు వేయిస్తున్నాం. వాహన తనిఖీల్లో భాగంగా మంచువల్ల ఎదురయ్యే సమస్యలను వివరిస్తున్నాం. ముఖ్యంగా ఆటోలు, వ్యాన్లు, ద్విచక్రవాహనాలు నడిపేవారు పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు. మితిమీరిన వేగం అనర్థదాయకం. సీటు బెల్టు, హెల్మెట్ వాడకం శ్రేయస్కరం.

- రాజగోపాల్ యాదవ్, సీఐ, బద్వేలు

పాటించాల్సిన జాగ్రత్తలు

- మంచుతీవ్రత అధికంగా ఉంటే ఆ ప్రభావం తగ్గే వరకు ప్రయాణం వాయిదా వేసుకోవాలి. ప్రయాణ సమయంలో మంచుతీవ్రత అధికమై రహదారి కన్పించకుంటే సురక్షిత ప్రాంతంలో వాహనాలు నిలుపుదల చేయాలి.
- మంచు కురిసే సమయంలో వాహనాలు నెమ్మదిగా నడపాలి. ఎదురుగా వచ్చే వాహన చోదకులు గుర్తించేలా వాహన హెడ్‌లైట్ ఆన్ ఆఫ్ చేయడం లేదా ఆఫ్ చేయడం శ్రేయస్కరం.
- ప్రయాణ సమయంలో బ్రేక్, సైడ్ ఇండికేటర్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖ్యంగా రోడ్ల మలుపుల వద్ద కుడి ఎడమలు స్పష్టం చేసే సిగ్నల్ లైట్స్ ఎదుటి వాహనదారులను అప్రమత్తం చేస్తాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్.. కారు, వ్యాను చోదకులు సీటు బెల్టు పెట్టుకోవాలి.
- వేకువజామున నిత్యం ప్రయాణించే కూరగాయలు, పాలు, వాటర్ ట్యాంకులు, పత్రికల వాహనాలు కచ్చితంగా వాహనం ముందు, వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు అతికించాలి.

మేకల మందపై చిరుతపులి దాడి

● ఒక మేక మృతి

● కనిపించని ఐదు జీవాల జాడ

● కుక్కల సాయంతో ప్రాణాలతో బయటపడ్డ కాపరి

● కనుగొండ సమీప గ్రామాల్లో తీవ్ర భయాందోళన

ములకలచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం సమీపంలో గల కనుగొండ రిజర్వు అటవీ ప్రాంతంలో మేకల గుంపుపై చిరుత పులి దాడి చేసింది. దీంతో ఒక మేక మృతి చెందగా.. మరొకటి తీవ్రంగా గాయపడింది. ఐదు మేకల జాడ కన్పించలేదు. కాగా మేకల కాపరిపై కూడా చిరుత పులి దాడి చేసేందుకు ప్రయత్నించగా.. తోడుగా ఉన్న కుక్కల సహాయంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనతో అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గ్రామాల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే...

పెద్దపాళ్యంలోని బీసీ కాలనీకి చెందిన పాళ్యం నరసింహులు మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి 120 మేకలు ఉన్నాయి. ప్రతి రోజు గ్రామానికి సమీపంలో ఉన్న కనుగొండ అటవీ ప్రాంతంలోకి మేత కోసం మేకలను తీసుకెళ్తుంటాడు. రోజూలాగే గురువారం మేత కోసం కనుగొండ అటవీప్రాంతంలోని పెద్దజారుబండ పడమటి వైపున తోలుకెళ్లాడు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో మేకల మందపై చిరుత పులి ఒక్కసారిగా దాడి చేసింది. వరుసగా ఐదు మేకలను అడివిలోకి లాక్కెళ్లింది. మరో మేకను గొంతు దగ్గర కరిచి చంపగా.. మరో మేక గొంతును నోటితో పట్టుకోగా కాపరి నరసింహులు తీవ్ర భయాందోళనకు గురై వణికిపోయాడు. చిరుతపులి కాపరిపై కూడా దాడి చేసేందుకు యత్నించింది. కాపరి వెంట ఉన్న రెండు కుక్కలు గట్టిగా అరవడంతో పాటు నరసింహులు గట్టిగా అరవడంతో చిరుతపులి అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయాన్ని కాపరి కుటుంబీకులకు తెలియజేయడంతో అతని కుమారుడు అశోక్, మరికొందరు సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లారు. తీవ్రంగా గాయపడ్డ మేకను, చనిపోయిన మేకను గ్రామంలోకి తీసుకొచ్చారు. గాయపడ్డ మేక గొంతు వద్ద చికిత్సలు చేయించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి కాపరిని విచారించి వెళ్లిపోయారు. కనీసం ఘటన జరిగిన ప్రాంతాన్ని కూడా పరిశీలించలేదని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. కాగా కుక్కలు లేకుంటే తన



రోదిస్తున్న మేకల కాపరి నరసింహులు

ప్రాణాలు కూడా పోయేవని, కుక్కలు గట్టిగా మొరగడంతో చిరుత పులి వెళ్లిపోయిందని గొర్రెల కాపరి నరసింహులు రోధించాడు. ఈ ఘటనతో కాపరులు శుక్రవారం అడివిలోకి గొర్రెలు, మేకలు తీసుకెళ్లేందుకు భయపడి గ్రామ సమీపంలోనే మేపారు. రక్తం రుచి చేసిన చిరుతపులి సమీప గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని గ్రామస్తులకు అవగాహన కల్పించి భయం పోగొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!

● ఎట్టకేలకు ప్రారంభమైన పెద్దేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

● రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు

● రెండేళ్ల తరువాత పనులు తిరిగి ప్రారంభం

ములకలచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం వద్ద ముంబై - చెన్నై జాతీయ రహదారిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణ పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నత్తకు నడక నేర్పేలా జరిగిన పనుల్లో కదలిక వచ్చింది. రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు చేశారు. దేశంలోనే అతి పొడవైన జాతీయ రహదారి(ఎన్‌హెచ్-42) కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో తరచూ రైల్వే గేటు పడుతుండడంతో వాహనాలు బారులు తీరి నిలిచిపోతున్నాయి. తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేవి. జాతీయ రహదారిలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని సమయం ఆదా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్దపాళ్యం రైల్వేగేటుపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.49కోట్లు మంజూరు చేసింది. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వాహనాలు రైల్వే గేటు నుంచి కాకుండా బ్రిడ్జిపై వెళ్తాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దపాళ్యం ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. ఏడాదిన్నర పాటు పనులు జరగడంతో బ్రిడ్జి నిర్మాణం పనులు చివరి దశకు చేరాయి. ఇరువైపులా రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే రైల్వేగేటుపై వెళ్తున్న బ్రిడ్జిపై కొంత భాగం పనులు నిలిచిపోయాయి. ఇక్కడ దిమ్మెలు ఏర్పాటు చేస్తే పనులు ముగుస్తాయన్న సమయంలో రెండేళ్ల పాటు నిలిపేశారు. దీంతో బ్రిడ్జి నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒక బూస్టింగ్ గిర్డర్‌ను భారీ యంత్రాల సహాయంతో రైల్వేగేటుపై ఏర్పాటు చేశారు. ఈ పనులను ఎన్‌హెచ్ ఏఈ మధుసూదన్, రైల్వే శాఖ పీడబ్ల్యుఐ శ్రీనివాసులరెడ్డి, టీఆర్‌డీ జగదీశ్వరన్ పర్యవేక్షించారు. అయితే మరో బూస్టింగ్ గిర్డర్‌ను తయారు చేయాల్సి ఉందని, ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని, ప్రస్తుతానికి ఇప్పుడు ఏర్పాటు చేసిన బూస్టింగ్ గిర్డర్‌కు తుది పనులు పూర్తి చేసి ఫ్లై ఓవర్‌పై రాకపోకలు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.



పెద్దపాళ్యం రైల్వేగేటుపై ఏర్పాటు చేసిన బూస్టింగ్ గిర్డర్

రాజంపేట చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు

రాజంపేటటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణానికి చెందిన 18 నెలల బుడతడు షేక్ మహ్మద్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో (వరల్డ్ కింగ్స్) చోటు దక్కించుకున్నాడు. ఈ ఏడాది నవంబరు 30న ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో అర్హత సాధించగా డిసెంబరు 19న ప్రశంసా పత్రాన్ని, మెడల్స్‌ను కొరియర్ ద్వారా మహమ్మద్ తల్లిదండ్రులకు పంపించారు. ఓబులవారిపల్లె మండలంలో వీఆర్వోగా పనిచేసే షేక్ ముజీబ్ రాజంపేట పట్టణం ఈడిగపాలెంలో నివాసం ఉంటున్నాడు. షేక్ ముజీబ్, మసూదా బేగం దంపతులకు షేక్ మహమ్మద్ అనే 18 నెలల కుమారుడు ఉన్నాడు. ఈ చిన్నారి ఏడాది వయసు నుంచే పలు రకాల జంతువులు, కూరగాయలు, పండ్లు, స్వాతంత్ర్య సమరయోధులు, వాహనాలు, శరీరావయవాలు పలువురు సినిమా హీరో, హీరోయిన్లు, 19 రకాల ఆట వస్తువులు, వివిధ ఆకృతులు, వాహనాల విడిభాగాలు తదితరాలను టక్కున గుర్తించి చెప్పేస్తున్నాడు. ఈ విషయాలన్నింటిని వారి తల్లిదండ్రులు వీడియో రికార్డు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు (వరల్డ్ కింగ్స్) వారికి సమాచారం అందించారు. ఆ సంస్థ ప్రతినిధులు ఈ వీడియో రికార్డులను పరిశీలించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ముజీబ్‌కు ప్రశంసాపత్రం, మెడల్స్‌ను పంపుతూ, వరల్డ్ కింగ్స్ టాప్ రికార్డ్సు జాబితాలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో అత్యంత తెలివైన వాడిగా చిన్నారిని గుర్తించారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తమ కుమారుడు షేక్ మహ్మద్ ఏడాది వయసు నుంచే ఏదైనా టక్కున గుర్తించి తెలియజేస్తాడని తెలిపారు. ఈ విధంగా ఏ ఆకృతిని చూపినా వెంటనే పేరు చెబుతాడన్నారు. కొందరి సలహా మేరకు తాము అన్ని విషయాలను వీడియో రికార్డింగ్ చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులకు పంపడంతో వారు ఈ ప్రశంసాపత్రాన్ని, మెడల్స్ పంపుతూ రికార్డులో నమోదు చేయడం తమకు ఆనందదాయకమన్నారు.



వివిధ ఆకృతులను గుర్తిస్తున్న చిన్నారి మహ్మద్

'అయ్యప్ప ఆలయాన్ని స్వాధీనం చేసుకోండి'

మదనపల్లె/కలికిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ మదనపల్లె గ్రూప్ టెంపుల్ ఈవోను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జీవో నెంబరు. 294 ఉత్తర్వులు జారీచేశారు. స్థానిక శివనగర్‌లో అయ్యప్ప స్వామి ఆలయం ఉంది. గతంలో దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని ఆలయ అభివృద్ధి పేరుతో ఏర్పాటైన కమిటీ వినతి మేరకు 2022 సెప్టెంబరులో అప్పటి ప్రభుత్వం ఐదేళ్ల పాటు అభివృద్ధి నిర్వహణ కోసం అప్పగించింది. అయితే ఈ కమిటీపై తరచూ అటు అధికారులు, ప్రభుత్వానికి భక్తుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. ముఖ్యంగా ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో ఫిర్యాదులు వస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రజల నుంచి భక్తుల నుంచి చందాలు వసూలు చేస్తున్నారని వాటికి సరైన లెక్కలు, రికార్డుల నిర్వహణ లేదని ప్రధాన అభియోగం. అలాగే ఆలయ కమిటీలో ప్రభుత్వం అనుమతి లేకుండా సభ్యులను మార్చేశాలరని తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారని వెల్లడైంది. ఈ పరిణామాలన్నింటిని పరిశీలించిన దేవదాయశాఖ ఆలయంపైన ప్రభుత్వం పైన చెడ్డపేరు వస్తుందని ఈ నిర్ణయం తీసుకుంది.

రోడ్డు పనికిపోతే దాడి చేశారు

సంబేపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కూలి పనులకు వెళితే తమపై దాడి చేయడంతో పాటు, చికిత్స పొందుతున్న తమపైనే కేసు కూడా పెట్టారని కొత్త వడ్డెపల్లెకు చెందిన జ్యోతి, మోహన్, హరీశ్, పుష్పాంజలి, రామాంజులు, అచ్చన్న ఆవేదన వ్యక్తం చేస్తుండగా, కౌంటర్ కేసు కోసమే వారు ఆస్పత్రిలో చేరారని సీఐ వివరిస్తున్నారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని నారాయణరెడ్డి గ్రామం పాలెంవాండ్లపల్లె నుంచి కొత్త వడ్డెపల్లె వరకు బీటీ రోడ్డు పనులు చేస్తున్నారు. శుక్రవారం పాలెంవాండ్లపల్లెకు చెందిన చంద్రయ్య ఈ రోడ్డు పనులు జరగకుండా అడ్డుకోవడంతో కొత్తవడ్డెపల్లె గ్రామస్తులు అతనితో ఘర్షణపడ్డారు. ఈ సందర్భంగా కూలి పనులకు వెళ్లిన తమపై చంద్రయ్య, సురేశ్, లక్ష్మీదేవి, బాలాజీ, సుమతి, అనిత తమపై దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో మోహన్ కాలు ఫ్రాక్చర్ అయిందన్నారు. దాంతో తాము ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటుండగా, తమపైనే కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఎస్ఐ భక్తవత్సలం వివరణ కోరగా... కొత్తవడ్డెపల్లె గ్రామస్తులు చంద్రయ్యకు చెందిన కంచె తొలగించడంతో పాటు దాడికి పాల్పడ్డారని, కౌంటర్ కేసు కోసమే వారు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు వివరించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి, మోహన్, హరీష్, పుష్పాంజలి, రామాంజులు, అచ్చన్న

ఆక్రమణదారులపై ఉక్కుపాదం



యంత్రాలతో అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండగా గుమికూడిన జనం

● ఆర్‌అండ్‌బీ స్థలంలో రేకుల షెడ్లు తొలగింపు

● అక్రమ నిర్మాణాలు నేలమట్టం

● దూకుడు పెంచిన రెవెన్యూ, పోలీసు అధికారులు

గాలివీడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను, నిర్మాణాలను నేలమట్టం చేసి అధికారులు దూకుడు పెంచారు. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి ఉక్కుపాదం మోపుతూ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే...

గాలివీడు పట్టణంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో సర్వే నెంబరు 2266లో ఉన్న 1.80 ఎకరాల భూమిలో ఆక్రమణలు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే తరుణంలో స్థానికుల ఫిర్యాదు మేరకు కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు కదిలిన స్థానిక రెవెన్యూ యంత్రాంగం, ఆర్‌అండ్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు 11 మంది ఆక్రమణదారులకు తాఖీదులు అందజేశారు. 15 రోజులు గడువు ఇచ్చిన అనంతరం సిక్స్ నోటీస్ ఇచ్చిన అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను జేసీబీ యంత్రాలతో తొలగించారు. అయితే స్థానికులు కొందరు తమ నిర్మాణాలు తొలగించాలంటే ఎదురుగా ఉన్న మరికొన్ని అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఎదురుతిరిగారు. దీంతో తహసీల్దార్ భాగ్యలత, ఎస్ఐ రామక్రిష్ణ సమన్వయంతో చాకచక్యంగా వ్యవహరించి ఆక్రమణలను తొలగించారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన రెవెన్యూ, పోలీసు అధికారుల తీరును ప్రజలు అభినందిస్తున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తత

గత 30 సంవత్సరాలుగా ఆర్‌అండ్‌బీ స్థలంలో రేకుల షెడ్లు నిర్మించుకుని వ్యాపారాలు, నివాసాలు ఉన్న వారికి రేకుల షెడ్లు తొలగించాలని గత రెండు నెలలుగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిని ఖాతరు చేయకపోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో అక్రమ నిర్మాణాలను తొలగించడానికి ఎక్సకవేటర్లతో ప్రయత్నం చేయగా అక్రమ నిర్మాణదారులు తమ నివాసాలను తొలగించవద్దంటూ అడ్డుకున్నారు. స్థానికుడు ఒకరు రేకుల షెడ్లపైకి ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానంటూ హల్‌చల్ చేశాడు. ఎట్టకేలకు అక్రమ నిర్మాణాలు తొలగించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కానిస్టేబుల్ బెదిరించాడని.. విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న విద్యార్థి

రాయచోటిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ బెదిరించడంతో ఓ విద్యార్థి మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్న కథనం సోషల్ మీడియాలో శుక్రవారం హల్‌చల్ చేస్తోంది. రాయచోటి మండలం మాధవరం గ్రామం కంచరపల్లి కాలనీకి చెందిన కాల్వపల్లి రామాంజనేయులు శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, అతని తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం కువైత్‌లో ఉన్నారు. గురువారం రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ధర్మా కంచరపల్లెకు వచ్చి రామాంజనేయులను ఇంటి నుంచి బయటకు లాగి, ఓ అమ్మాయి నుంచి బంగారం తీసుకున్నావని ఆరోపించడంతో పాటు, నానా దుర్భాషలాడినట్లు బంధువులు తెలిపారు. తనకు ఏమీ తెలియదని చెబుతున్నా వినకుండా కొట్టడంతో మనస్తాపానికి గురై ఇంట్లోకి వెళ్లి గుళికల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. వెంటనే అతన్ని రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి పరిస్థితి సీరియస్‌గా ఉందని పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో, వెంటనే తిరుపతిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఆ విషయం తనకు తెలియదని, ఎటువంటి ఫిర్యాదు అందలేదని సమాధానమిచ్చారు.

జిల్లాలో 31 వేల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం

కలికిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో 30950 ఎకరాలకు సూక్ష్మ సాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిణి వై.లక్ష్మీ ప్రసన్న తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అమర్చడానికి 30 కంపెనీలను గుర్తించామని, ముందుకొచ్చిన రైతులందరికీ సబ్సిడీపై వెంటనే పరికరాలు అమర్చేందుకు కంపెనీలు కూడా సిద్ధంగా వున్నాయని ఆమె చెప్పారు. వాయల్పాడు, కలికిరి, కలకడ, పీలేరు, కేవీపల్లె మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల వ్యవసాయ, పశుసంవర్థక సహాయకులతో కలికిరి కేవీకేలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంఐఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ 5 ఎకరాల్లోగా విస్తీర్ణం కలిగిన రైతులకు 90 శాతం, పది ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అమర్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రిప్‌తో సాగు చేసిన పంటల నుంచి తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయాన్ని రాబట్టవచ్చని వివరించారు. మొత్తం 30 కంపెనీల్లో రైతులకు నచ్చిన కంపెనీ నుంచి పరికరాలు అమర్చే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు స్థానిక రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. నమోదైన రైతుల పొలాల్లో వెంటనే సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతు నమోదు చేసుకున్నప్పటి నుంచి పరికరాలు అమర్చడం పూర్తయ్యే వరకూ వివిధ దశల్లో చేయాల్సిన పనులకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మదనపల్లె, పీలేరు ఉద్యాన అధికారులు ఈశ్వరప్రసాద్, సుకుమార్‌రెడ్డి, ఎంఐడీసీ హరినారాయణ, ఎంఐఏవో దుర్గయ్య, ఉమాదేవి, వివిధ డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చు... అధిక దిగుబడులు

డ్రమ్‌సీడర్‌తో వరి సాగు.. రైతులకు లాభదాయకం



డ్రమ్ సీడరు విధానంతో వరిని ఎలా నాటాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో వర్షాలు సకాలంలో కురవక నార్లు పోయడం, నాట్లు వేయడం ఆలస్యం కావడంతో వరి దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా నారును నెలరోజులు పెంచి నారు తొలగించి నాటు వేయడానికి అధిక ఖర్చు కావడమే కాక నీటి వాడకం కూడా అధికమవుతుంది. ఈ నేపథ్యంలో రైతులు డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

డ్రమ్ సీడర్‌తో సాగు - ఉపయోగాలు

డ్రమ్‌సీడర్ పద్ధతిలో నార్లు పెంచి నాటు వేయాల్సిన అవసరం లేదు. దీంతో నాటుకు అవసరమైన కూలీల ఖర్చును ఆదా చేయవచ్చు విత్తన మోతాదును సగానికి సగం తగ్గించవచ్చు. డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తినప్పుడు ఒక చదరపు మీటరుకు ఉండాల్సిన మొక్కల సంఖ్య ఖచ్చితంగా ఉండడంతో వరి దిగుబడులు నాటు వేసిన వాటికంటే అధికంగా ఉంటాయి. వర్షాలు ఆలస్యమై నీరు సకాలంలో అందనప్పుడు కాల్వల ద్వారా నీటి విడుదల ఆలస్యమైనప్పుడు ముదురు నార్లతో నాట్లు వేస్తారు. దీని వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. అలాంటి పరిస్థితుల్లో డ్రమ్ సీడరు పద్ధతి అనువుగా ఉంటుంది. సాళ్ల మధ్యలో యంత్రాలతో అంతరకృషికి వీలుంటుంది. నాటు వేసిన వరి కన్నా 5 - 7 రోజులు ముందుగా డ్రమ్ సీడరుతో వేసిన వరి కోతకు వస్తుంది.

నేల తయారీ...

డ్రమ్ సీడరుతో వరి నాటే సమయంలో సాధారణ పద్ధతిలో కంటే వీలైనంత బాగా చదును చేసుకోవాలి. ఎత్తు పల్లాలు లేకుండా సమాంతరంగా ఉండడం చాలా అవసరం. పొలంలో నీరు నిల్వ ఉండకూడదు కాబట్టి నీరు ఎక్కువైతే బయటికి పోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా విభజించుకుంటే చదును చేయడానికి, నీరు పెట్టడానికి, విత్తనం చల్లడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. విత్తే సమయానికి నీరు లేకుండా బురద ఉంటే చాలు. ఇసుక శాతం ఎక్కువగా ఉన్న నేలలో విత్తాలనుకున్న రోజే ఆఖరి దమ్ము చేసి చదను చేసి పలుచటి నీటి పొర ఉండేట్లు చూసుకోవాలి. బంక నేలల్లో ఆఖరి దమ్ము చేసి చదను చేసిన మరుసటిరోజు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు

రకాన్ని బట్టి ఎకరాకు 10 - 15 కిలోలు అవసరమవుతాయి. కాండం గట్టిగా ఉండి వేరు వ్యవస్థ దృఢంగా ఉండి పడిపోని రకాలు మిక్కిలి అనుకూలం. ఆయా ప్రాంతానికి అనువైన, రైతుకు ఇష్టమైన ఏ రకమైనా ఈ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు.

విత్తన శుద్ధి

డ్రమ్‌సీడరు ద్వారా విత్తుకునేటప్పుడు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజయ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 12 గంటలు నానబెట్టి 24గంటలు మండెకట్టి కొద్దిగా ముక్కు పగిలిన గింజలను వాడకోవాలి.

విత్తే విధానం ఇలా..

డ్రమ్ సీడరు డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. గింజలు రాలడానికి వీలుగా ప్రతి డ్రమ్‌లో కేవలం 3/4 వంతు మాత్రమే మొలకెత్తిన గింజలను నింపాలి. గింజలు నింపిన డ్రమ్ సీడరు లాగితే 8 వరుసల్లో వరుసకు వరుసకు మధ్య 20 సెం.మీ దూరంలో గింజలు పడతాయి. వరుసల్లో కుదురుకు కుదురుకు మధ్య దూరం 5 - 9 సెంమీ ఉంటుంది. ఒక్కో కుదురులో 5 -8 గింజలు పడడం జరుగుతుంది. కొన్ని అనివార్యకారణాలతో కుదురులోని గింజలు 50 శాతం దెబ్బతిన్నా మిగిలిన 50శాతం గింజల నుంచి వచ్చిన మొక్కల సాంద్రత సరిపోతుంది. రకాన్ని బట్టి గింజలు పడడాన్ని బట్టి రంధ్రాలను స్టాపర్స్‌తో మూసుకోవాలి. సన్న గింజ రకాలకు రంధ్రం వదిలి రంధ్రం మూసివేయాలి. 16 వరుసలకు అడుగు వెడల్పు కాలిబాట ఉంచుకోవాలి. తాడు ఉపయోగించి డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి. ఆయా ప్రాంతాలకు మరియు రకాలకు సిఫార్సు చేసిన ఎరువులనే డ్రమ్ సీడరు పద్ధతిలో సాగు చేసిన వరికి వాడుకోవాలి.

నీటి యాజమాన్యం

విత్తిన తరువాత మొదట్లో నీరు లేకుండా బురదగా మాత్రమే ఉండి డ్రమ్ సీడరుతో సాగు - అవరోధాలు డ్రమ్‌సీడరు పద్ధతి చౌడు నేలలకు, నీట ముంపునకు గురయ్యే ప్రాంతాలకు అనువు కాదు.

పంట బాగా చేతికి వస్తుంది



డ్రమ్ సీడరు విధానంతో వరి పంట సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ విధానంతో రైతులకు కూలీల ఖర్చు, నీటి వాడకం తగ్గుతుంది. పంట కూడా బాగా చేతికి అందుతుంది.

- సాయిజ్యోతి,మండల వ్యవసాయాధికారి


పశువుల వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

● పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు శారదమ్మ

కడప రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా పశువులకు వచ్చే వ్యాధులను నియంత్రించడానికి పశుసంవర్ధకశాఖ సమర్థవంతమైన చర్యలు చేపడుతోందని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. 2024-25 ఆర్థిక నాల్గవ త్రైమాసికంలో చేపట్టాల్సిన వైద్యసేవలు, టీకాల కార్యక్రమాలు ఇతర వైద్యసేవల గురించి క్షేత్రస్థాయి సిబ్బందికి ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అంతేకాకుండా జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు రూ.13కోట్ల విలువ కలిగిన మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పశువుల మందులు, టీకాల వినియోగంలో పారదర్శకత ఉండాలని వినియోగ వివరాలను ఖచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలి

కడప రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలని కడప జిల్లా పోర్ట్ పోలియో(హైకోర్టు) జడ్జి రామకృష్ణ ప్రసాద్‌ను కోరినట్లు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు తెలిపారు. ఈ మేరకు కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, సభ్యులు జయరామిరెడ్డి, చిన్నయ్య తదితరులతో శుక్రవారం అమరావతిలోని హైకోర్టులో జడ్జి రామకృష్ణ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న ఈగిల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విషయమై జడ్జి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని చెప్పారన్నారు. అనంతరం హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కవలడానికి ప్రయత్నించగా వీలుపడలేదని.. చాంబర్‌లో రెప్రజెంటేషన్ ఇచ్చామన్నారు.



వివాహేతర సంబంధంతో భర్తను హత్యచేయించిన భార్య

● భార్య, ప్రియుడితో సహా నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రఫీ, ఎస్సై విద్యాసాగర్

కొండాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా యల్లనూరు గ్రామానికి చెందిన సురేశ్ (36) ఈ నెల 17న మండలంలోని లావనూరు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు హత్యగా నిర్ధారించారు. వివాహేతర సంబంధం కారణంగా అతని భార్య, ప్రియుడు కలిసి హత్య చేయించారని పోలీసులు వెల్లడించారు. శుక్రవారం కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహమ్మద్ రఫి, ఎస్ఐ విద్యాసాగర్‌లు వివరాలు వెల్లడించారు. యల్లనూరు గ్రామానికి చెందిన చిన్నగుల్లోబన్నగారి సురేశ్ భార్య వీరకుమారికి కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన గజ్జప్పగారి బాబుతో వివాహేతర సంబంధం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరూ కలిసి ఊరు వదిలి వెళ్లిపో యారు. ఆమె తిరిగి భర్త వద్దకు వచ్చినప్పటి నుంచి ఇద్దరికి గొడ వలు జరిగేవి. ఆ తర్వాత ఆమె పుట్టింటికి వెళ్లి ఉంటోంది. ఈ నేప థ్యంలో వీరకుమారి, బాబు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. సురేశ్ ఉంటే తమకు అడ్డువస్తాడని సురేశ్ హత్యకు పన్నాగం పన్నారు. ఈ నేపథ్యంలో బాబు స్నేహితుడు వెలిదండ్ల సుభాన్‌కు రూ.1,00,000, కిరణ్ అనే వ్యక్తికి రూ.50,000 ఇచ్చి సురేశ్ హత్యకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనెల 16వ తేదీ రాత్రి బర్త్‌డే పార్టీ కొండాపురంలో ఉందని సుభాన్ కిరణ్‌లు బొలేరో వాహనంలో సురే శ్‌ను ఎక్కించుకున్నారు. లావనూరు గ్రామం వద్ద ఉన్న నల్లవంక బ్రిడ్జి వద్దకు రాగానే సురేశ్‌కు ఎక్కువ మోతాదులో మద్యం తాగిం చారు. స్పృహ కోల్పోయిన తర్వాత నల్లని తాడుతో సురేశ్ గొంతు బిగిం చి హత్య చేసి మృతదేహాన్ని బ్రిడ్జిపై పడేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహం వద్ద తాగిన మద్యం బాటిళ్లు, నీళ్ల ప్యాకెట్లు గ్లాసులు ఉంచారు. దీంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, విద్యాసాగర్ గత మూడు రోజులుగా ఎల్లనూరు పోలీసుల సహకారంతో కేసును ఛేదిం చారు. గురువారం సాయంత్రం బాబు, సుభాన్, కిరణ్, వీర కుమా రి లను అరెస్టు చేసి.. బొలేరో వాహనం, పల్సర్‌బైకు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.. వీరిని ప్రొద్దుటూరు కోర్టులో హాజరు పరచగా కడప జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలపారు.

దుంపలగట్టులో భారీ చోరీ

● రెండిళ్లలో దొంగతనం ● బంగారు, నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఖాజీపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నడు లేని విధంగా దుంపలగట్టు గ్రామంలో గురువారం రాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఇళ్లలోని వారు బయటకు రాకుండా గృహాలకు గడియ బిగించి దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామస్థుల కథనం మేరకు.. గురువారం రాత్రి 11 గంటల వరకు రామాలయం గుడిలో కొందరు గ్రామస్థులు భజనలు చేసి ఇళ్లకు వెళ్లారు. తర్వాత ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ మూడు గృహాలకు బయటకు రాకుండా గడియ బిగించి చోరీలకు పాల్పడ్డారు. తీరా ఉదయం చూస్తే దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ మోహన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిలో 148 గ్రాముల బంగారం, రూ.4.20 లక్షలు నగదు, ఇండ్ల సుధాకర్‌రెడ్డి గృహంలో 20 గ్రాముల బంగారం, రూ.20 వేలు నగదు అపహరణకు గురైందని తెలిపారు. వేలిముద్రలు సేకరించడంతోపాటు డ్వాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి దొంగలను పట్టుకునేందుకు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నామన్నారు. సీసీఎస్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి, క్లూస్‌టీం సీఐ రుక్మిణిదేవి, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు శిక్ష

బద్వేలు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అర్బన్ పోలీసు స్టేషన్‌పరిధిలో వెంకటరమణారెడ్డి అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన కేసులో నిందితుడు మీసాల వెంకటయ్య, మీసాల శ్రీనివాసులకు శనివారం అడిషినల్ సీనియర్ సివిల్‌జడ్జి 2సంవత్సరాల 6నెలల సాధారణ కారాగార శిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. బాధితుని తరుపున ఏపీపీ కె.రవిచంద్ర వాదనలు వినిపించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్షపడేలా కృషిచేసిన అర్బన్ సీఐ రాజగోపాల్, కోర్టు కానిస్టేబుల్ పి.నాగరాజులను ఉన్నతా ధికారులు అభినందించినట్లు ఆయన తెలిపారు.

బలిజల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మేడ కళ్యాణమండపంలో ఈనెల 22న జరిగే బలిజల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హర్షప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రతి బలిజ కులస్తుడు తప్పకుండా హాజరుకావాలని కోరారు. శుక్రవారం కడపలోని హరిట వర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బలిజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహానేత ఎన్టీరామారావు హయాంలో బలిజలకు మూడు ఎమ్మెల్యే పదవులు ఒక ఎంపీ పదవి ఉండేదని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన పార్టీలు బలిజలకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. చంద్రబాబు రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్‌ను బలిజలకు కేటాయిస్తే కుట్రలు చేసి ఓడించారన్నారు. రాయలసీమలో బలిజ కులస్తులు ఎవరు కూడా క్రియాశీలక పదవులలో లేరన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యే మంత్రి నారాయణ, రామానాయుడు, దుర్గేష్‌లతో చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. బలిజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి అవన్నీ సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బలిజ ప్రతినిధులు నాగరాజు, ప్రసాద్, బాబు, కేవీ రావు, బాలకృష్ణ, రామచంద్రయ్య, మస్తాన్, వెంకట సుబ్బయ్య, సీఆర్‌సీ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కందిమల్లయపల్లె ఈశ్వరీదేవి మఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి వీరశివకుమారస్వామి తెలిపారు. 22న ఆదివారం ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం నైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగం, రాత్రి కలశోత్సవం, కలశ స్థాపన నిర్వహించడం జరుగుతుందన్నారు. 23న సోమవారం అశ్వవాహన ఉత్సవం, రాత్రి హంసవాహన ఉత్సవం ఉంటుందని తెలిపారు. 24న మంగళవారం ఈశ్వరీ దేవిమహాదేవి సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్ర సుదినం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు, శాంతి హోమాలు, రాత్రి సింహ వాహనంపై గ్రామోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ, ఊయల సేవ, సాయంత్రం తులాభారం కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 25న పుష్ప రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. 26న పూర్వ మఠాధిపతి వీరబ్రహ్మయ్యాచార్య స్వాముల వారి ఆరాధన నిర్వహిస్తారన్నారు. 27న మహాప్రసాద వినియోగం, దివ్య మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ భక్తులకు అందజేస్తామని తెలిపారు.

నేడు వైవీయూలో ఇండక్షన్ ప్రోగ్రామ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 21వ తేదీ ఉదయం 10గంటలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోస్ట్‌గ్రాడ్యు యేషన్ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్టారెడ్డి, విశిష్ట అతి థులుగా కుల సచివులు ఆచార్య పి.పద్మ, గౌరవ అతిథులుగా రాజపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, చిన్మయమిషన్ అధ్యక్షుడు తురి యానందస్వామి, తైక్వాండో శిక్షణా నిపుణులు ఎం.నాగౌర్‌బాబు హాజరవుతున్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులు సాగిస్తూ అనకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈకార్యక్రమం చేపడుతున్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలి



మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

పెండ్లిమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్ ఈనెల 27వ తేదీ పర్యటన సందర్భంగా ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెల్లటూరులో మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన, పంటల సాగు గురించి, మినుము, చామంతి, వేరుశనగ, మామిడి పంటలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఓబులేసు, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇండోర్ స్టేడియం అక్రమాలపై విచారణ

ప్రొద్దుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూలు గ్రౌండ్‌లోని ఇండోర్ స్టేడియం మెయింటనెన్స్‌కు సంబంధించి జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు ఆదేశించారు. ఆమేరకు తిరుపతి పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్యామ్ సుందర్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఇండోర్ షటిల్ స్టేడియంకు వచ్చే ఆదాయానికి ఖర్చులకు సంబంధించి గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్లు సంక్రాంతి వెంకటకృష్ణ, ప్రమోద్ కుమార్‌లు నిబంధనలు పాటించకుండా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో ఈ స్టేడియంలో జరిగిన అవకతవకలపై విజిలెన్సు విచారణ నివేదిక సైతం మున్సిపల్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ నేపథ్యంలో తిరిగి మూడు నెలలలోపు ఈ విచారణ పూర్తి చేసి ఇందుకు బాధ్యులైన అధికారులపై చార్జ్‌ఫ్రేమ్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏపీజీఈఏ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రఘు రామనాయుడు, రాష్ట్ర కోశాధికారి డి.శ్రీహరి పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.ప్రసాద్‌గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ భాగ్యప్రసాద్, ఉపాధ్యక్షులు టి.సుమర్ జి, సి.నజీర్, జి.శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్.గిరిధర్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా ఎస్.జిగాని బాష, మహిళా విభాగం పి.భువనేశ్వరి, కోశాధికారి మహేశ్వరరెడ్డి, డీఈసీ మెంబర్స్‌గా బి.ప్రత్యూష ఎస్.విజయ, రాష్ట్ర ఈసీ మెంబర్‌గా ఎస్.మహబూబ్ రెహమాన్ ఎన్నికయ్యారు. రఘురామనాయుడు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకోసం కృషి చేయాలని నూతన నాయకత్వానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సురేంద్రనాథ్, జిల్లా మాజీ అధ్యక్షులు ఫణీంద్ర, పుల్లయ్య, అబ్దుల్ ఖాదర్, మహేష్, శ్రీహరి, రాజశేఖర్, వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య

● అనాథలైన కుటుంబసభ్యులు





ఆత్మహత్య చేసుకున్న మల్లేశం (ఫైల్), అనాథలైన కుటుంబ సభ్యులు

దువ్వూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేతికందని పంటలు... వెంటాడిన అప్పుల బాధలు... కుటుంబ కష్టాలు... వెరసి అన్నదాత ఆత్మహత్యకు దారితీశాయి. ఈ సంఘటన దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో జరిగింది. మల్లేశం (35)అనే రైతు తనకున్న అర్ధఎకరంతో పాటు నాలుగు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకున్నాడు. నాలుగేళ్లుగా వివిధ పంటల సాగుకు చేసి సక్రమంగా చేతికి రాకపోవడంతో ప్రతి ఏటా అప్పులపాలయ్యాడు. పంటల సాగుకు రూ.6లక్షలు దాకా అప్పులు చేశాడు. అసలే నిరుపేద కుటుంబం. మూడు సంవత్సరాల నుంచి 8 సంవత్సరాల వయస్సు కలిగిన నలుగురు ఆడపిల్లలు కలిగి ఉన్నారు. భార్య సుమలతతోపాటు తల్లి లక్ష్మీదేవి కూలిపనికి వెళుతున్నా కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో మల్లేశం ఉన్న కొద్ది బంగారం సైతం కుదువకుపెట్టి అప్పులు చేశాడు. ఈ పరస్థితుల్లో చేసిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యజమాని మరణంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి అనాథలా మారింది. ఈ సంఘటన గ్రామస్థులను కలచి వేసింది.

కన్యకాపరమేశ్వరికి ధనుర్మాస పూజలు


అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వేంపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకపారమేశ్వరి దేవస్థానంలో ధనుర్మాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవర సురేంద్ర మాట్లాడుతూ అమ్మవారికి ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో రోజు వేకువనే ఏకావర్తి, ద్వితీయవర్తి, తృతీయావర్తి, పంచావర్తి, నక్షత్ర, రథ, కుంభ, మహా మహామంగళ హారుతుల వేద మంత్రోచ్చారణతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధనుర్మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారు భ్రమరాంబ అలంకారంలో దర్శనమిచ్చారని తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించామన్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు.. అపహాస్యం పాలు...

నామమాత్రంగా అధికారుల హాజరు ● రైతుల సమస్యలు వినే నాథుడే కరువు

నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తీసుకోవాలని వెంకటాపురం వాసుల డిమాండ్

పులివెందుల టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించాలని సదుద్దేశంతో 'మీ భూమి.. మీ హక్కు' పేరుతో ఈ నెల 6 నుంచి జనవరి 7 వరకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు అపహాస్యం పాలవుతున్నాయి. వెంకటాపురం, ఎర్రగుడిపల్లెలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నామమాత్రంగా ప్రారంభించిన అధికారులు ఫొటోలకు ఫోజులు ఇచ్చి వెళ్లిపోయారు. సమస్యలు విన్నవించుకుందాం అనుకుంటే అధికారులే కరువయ్యారు. సభాప్రాంగణలో అధికారులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇక్కడే కాకుండా ప్రతి చోటా కార్యక్రమాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. మళ్లీ వస్తారేమోనని అధికారుల కోసం ఎదురు చూస్తూ పడిగాపులు కాశారు. చివరికి ఎవరూ రాకపోవడంతో ఆ ప్రాంత రైతులు మా మొర ఆలకించే వారే లేరా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు స్వీకరించడానికి అధికారులు లేనప్పుడు రెవెన్యూ సదస్సులు ఎందుకు దండగ అంటూ ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కూటమి నేతలైనా చొరవ తీసుకోవాలి

కూటమి ప్రభుత్వ నేతలు మాత్రం రెవెన్యూ సదస్సులు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్నాం అని అధికారులు చిత్తశుద్ధితో పని చేసి రైతులకు సంతృప్తి స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని చెబుతున్నారు. అధికారులు నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు. కూటమి నేతలైనా చొరవ చూపి సదస్సులు విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సదస్సులో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

సమస్యలు తీర్చేందుకే...

వల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు తీర్చేందుకే రెవెన్యూ సదస్సులు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని తహసీల్దారు శ్రీవా ణి అన్నారు. తప్పెట్ల సచివాలయంలో నిర్వహించి న రెవెన్యూ సదస్సులో రైతుల అర్జీలను పరిశీలిం చి సరైన ధ్రువపత్రాలతో కావాల్సిన అంశాలను పరిశీలించి వారికి న్యాయం జరిగేలా చూస్తామ న్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, తప్పెట్ల సర్పంచ్ భర్త గడికోట సుధాకర్‌రెడ్డి, చెరు వు సంఘం అధ్యక్షుడు సదాశివరెడ్డి, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల కోసమే సదస్సులు

చెన్నూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు భవిష్యత్తులో భూముల పరంగా ఇబ్బందులు పడకుండా వారి సమస్యలు తీరాలని ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు సరస్వతి అన్నారు. గుర్రంపేట పంచాయతీ సదస్సులో పలువురు రైతులు భూ సమస్యలను తహసీల్దారుకు అర్జీల రూపంలో సమర్పించారు. రైతులకు సంబంధించి ముందుగానే గ్రామంలో 1బీ అడంగల్ భూములకు సంబంధించి చూసుకోవాలంటూ పంపిణీ చేశారు. మండల సర్వేయరు సోమశేఖర్, డీటీ వెంకటరమణ, సర్వే డీటీ అర్చన, ఆర్ఐ కౌషిక్, వీఆర్వో శివ, రైతులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

జిల్లా వ్యవసాయాధికారి శంకర్‌నాయక్

కమలాపురం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎరువులను ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలో ఎరువుల దుకాణాలు కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని కమలాపురం, వల్లూరు మండలాల్లో ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. ఎరువుల దుకాణదారులు చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని సూచించారు. యూరియా ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. షాపు వద్ద స్టాకు రిజిస్టరు, బిల్‌బుక్, స్టాకు బోర్డు తప్పక ఉంచుకోవాలన్నారు. డీలర్లు ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు, మందులు అమ్మరాదని, అలాంటివి కలిగి ఉన్నా ఒక వేళ రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఏఓ ఎం.సరస్వతి, సాయిజ్యోతి, వ్యవసాయ విస్తరణాధి కారి దస్తగిరి, కమలాపురం వల్లూరు మండలాల డీలర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

వల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కడప శంకర్‌నాయక్ పరిశీలించారు. ఇందులో భాగంగా అన్ని రికార్డులు తనిఖీ చేశారు. గోడౌన్‌లోని ఎరువుల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. ఏఓ సాయిజ్యోతి, దుకాణ యజమాని పాల్గొన్నారు.

వర్రాను కలిసిన కుటుంబ సభ్యులు


వర్రాను కలిసి జైలు నుంచి బయటికి వస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

కడప క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోషియల్ మీడియాలో అసభ్య పోస్టింగులు పోస్టు చేసిన, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు అయి కడప కేంద్ర కారాగారంలో రిమాండులో ఉన్న వర్రా రవీంద్రరెడ్డిని శుక్రవారం అతని భార్య, కుటుంబ సభ్యులు కలిశారు. వర్రాపై రాష్ట్ర వ్యాప్తంగా పలు కేసులు నమోదవడంతో ఆ కేసులకు సంబంధించి పీటీ వారంట్లపై పలు కోర్టుల్లో హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కూడా కస్టడీ ఇవ్వాలని కోర్టుకు అప్పీలు చేయడంతో మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో కడప కేంద్ర కారాగారంలో ఉన్న రవీంద్రారెడ్డిని కుటుంబ సభ్యులు మిలాఖత్ ద్వారా కలిశారు.

జేఎన్టీయూలో ఆశ్రయ్ 2కె24-25 ప్రారంభం

పులివెందుల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూలో ఆశ్రయ్ 2కె24-25ను శుక్రవారం సివిల్ విభాగంలో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్, గౌరవ అతిథి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శేషమహేశ్వరమ్మ విజ్ఞానం, సాంకేతికను ఎలా పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 3డిమ్యాక్స్- ఆటోక్యాడ్‌పై విద్యార్థులకు రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ముందుగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సివిల్ విభాగాధిపతి ప్రొఫెసర్ సూర్యనారాయణరెడ్డి, పేపర్ ప్రజెంటేషన్ అతిథిగా ఎస్‌వీవీ.ప్రసాద్, ఏఐటీఎస్ రాజంపేట, సదస్సు ఇన్‌చార్జ్ మురళీమోహన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి

జడ్పీ సీఈఓను కోరిన ఎస్టీయూ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యల పరిష్కారానికి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించి స్పెషల్ డ్రైవ్ ద్వారా దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపాలని ఎస్టీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఈఓ చాంబర్‌లో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల పీఎఫ్ సబ్‌స్క్రిప్షన్, మిస్సింగ్ క్రెడిట్లను, ఫైనల్ పేమెంట్లు చెల్లింపుల్లో ఆడిట్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను తెలిపారు. దీంతో పాటు మరికొన్ని సమస్యలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. సీఈఓ స్పందిస్తూ త్వరలో ఒక కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను సేకరించి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సురేష్‌బాబు, రమణారెడ్డి, బాల్‌గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా గడువు పొడిగింపు

పులివెందుల టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పంటలకు బీమా చేసుకోవడానికి గడువు పెంచినట్లు ఏఓ నాగలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ గడువు ఈ నెల 15 నాటికి ముగిసినా రైతుల కోరిక మేరకు ప్రభుత్వ 31 వరకు గడువు పెంచిందన్నారు. బీమా చేయించుకోవడం కోసం క్రాప్‌లోను సర్టిఫికెట్‌ను రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల వద్ద తీసుకుని దగ్గరలోని మీ సేవ కేంద్రం సీఎస్‌సీ సెంటర్లులో నమోదు చేయించుకోవాలని సూచించారు. వేరుశనగ పంటకు ఎకరాకు 30వేల బీమా కాగా రైతులు 450 ప్రీమియం చెల్లించాలన్నారు. ఎకరా మామిడికి 35వేలు కాగా రైతులు 1750 ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, కౌలు రైతులు అయితే సీసీఆర్‌సీ పత్రం, రైతు సేవాకేంద్రం జారీ చేసే ధృవీకరణ పత్రం, రైతు డిక్లరేషన్, మొబైల్ నెంబరు, రైతు బ్యాంకు ఖాతా మొదటి పేజీ కాపీలను దరఖాస్తులో నమోదు చేయాలన్నారు.

కాలభైరవ జయంతి వేడుకలకు తరలిరండి

కడప కల్చరల్, డిసెంబరు 20, (ఆంధ్రజ్యోతి): కాలభైరవ స్వామి జయంతి వేడుకలకు తరలిరావాలని బాసట స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బాలాజీరావు తెలిపారు. సంస్థ దత్తత గ్రామమైన కాలభైరవపురం (ఎంఎస్ కొట్టాల)లో వెలసిన ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామి దేవస్థానంలో సోమవారం వేడుకలు జరుగనున్నాయి. ఉదయం 7 గంటలకు స్వామివారికి అభిషేకం, 9 గంటలకు కూష్మాండ దీప సేవారాధన, 10 గంటలకు హోమం, 12 గంటలకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు.

ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఫ్లెక్సీలు బ్యానర్లు ఏర్పాటు చేయాలంటే కేఎంసీ ప్లాన్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి, అనుమతి ఉంటేనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సిటీ ప్లానర్ రమణ పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫ్లెక్సీలు ప్రజలు, శాంతిభద్రతలపై ప్రభావం చూపకూడదన్నారు. అనుమతి నకలను పరిశీలించిన తర్వాతే ఫ్లెక్సీలను ప్రింట్ చేయాలని సూచించారు. అనుమతి కోరుతున్న నకలు కాపీని జతపరుస్తూ కార్యనిర్వాహక అధికారుల ద్వారా అనుమతి పొందాలన్నారు. లేనిచో సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసు దాఖలుకు చర్యలు తీసుకుంటారని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

వర్షంతో ఆందోళనలో శనగరైతులు

లింగాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు శనగరైతుల్లో ఆందోళన నెలకొంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు లింగాలలో 2.9సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. శనగ పంట ప్రస్తుతం పూతదశలో ఉది. వర్షం దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆలయ పునరుద్ధరణ పనులకు కమిటీ ఏర్పాటు

కలికిరి/కడప, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప చిన్నచౌక్‌లో వున్న వీరాంజనేయస్వామి ఆలయం పునరుద్ధరణ పనులు పూర్తి చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయం అభివృద్ధిలో భాగంగా పునరుద్ధరణ పనుల కోసం 1989 జూన్ 30న ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే ఈ నిధులతో చేపట్టిన పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉండడంతో ఈ పనులు పూర్తి చేయడం కోసం తాజాగా ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేవదాయ శాఖ కమిషనరు ఆలయ కమిటీని ఏర్పాటు చేసి పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని చేసిన ప్రతిపాదనలతో ఆలయ కమిటీ చైర్మన్‌గా కె. నారాయణ, అధ్యక్షుడిగా కె. నాగరాజ, ఉపాధ్యక్షుడిగా కె. మహేష్, కోశాధికారిగా కె. శివప్రసాద్, కె. శ్రీనివాసులు, కె. అనిల్, కె. ఆంజనేయులు, ఎస్. శ్రీనివాసులు, కె. వేణుగోపాల్, జి.వి.ఎస్. ప్రసాద్, ఎస్. అమరనాథ రెడ్డి, పి. రమణా రెడ్డి, యు. సాంబశివా రెడ్డి, టి. వెంకట మనోహర్ రెడ్డి ని సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ఒత్తిడి నుంచి ఉపశమనం పొందితేనే ప్రశాంతత

రాజయోగిని, బ్రహ్మకుమారి శివలీల అక్కయ్య

కడప మారుతీనగర్, డిసెంబరు 20, (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందితేనే మనసుకు ప్రశాంతత చేకూరుతుందని రాజయోగిని, బ్రహ్మకుమారి (విశాఖ) శివలీల అక్కయ్య సూచించారు. నిత్యం ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో తలమునకలౌతున్న ఆర్టీసీలో పనిచేస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బందికి 'వత్తిడి లేని జీవిత ప్రయాణం' అంశంపై కడప రీజనల్ కార్యాలయం (ఆర్.ఎం.ఆఫీస్)లో ప్రత్యేక అవగాహన నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కడప-ఓం శాంతినగర్ సేవా కేంద్రం ఆంధ్రా-కర్ణాటక సబ్-జోన్ అదనపు ఇన్‌చార్జ్ రాజయోగిని గీత దీది ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ అశాంతితో కాలం వెళ్లదీస్తున్నారని గుర్తుచేశారు. మనం చూసే దృష్టి కోణంలో మార్పు తీసుకొస్తే మనసులో కలిగే అలజడి, ఆందోళన తొలగి మనసుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. రోజూ 5 నిమిషాలు రాజయోగ మెడిటేషన్ అభ్యసిస్తే విధులు సక్రమంగా నిర్వహిస్తూనే, ప్రశాంతమైన జీవితాన్ని గడపగలరన్నారు. ఆధ్యాత్మిక జీవన విధానంపై శిక్షణ ఇస్తూ, చెడు అలవాట్లకు ఎలా దూరం కావాలో తెలిపి 15 నిమిషాలు రాజయోగ మెడిటేషన్ అభ్యాసం చేయించారు. ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఎం గోపాల్‌రెడ్డి, బ్రహ్మకుమారీలు ప్రదీప అక్కయ్య పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి 100 పుస్తకాల వితరణ

కడప కల్చరల్ 20, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ మేనేజర్ వై. సుబ్రహ్మణ్యం సుమారు 100 పుస్తకాలను సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి అందజేశారు. శుక్రవారం స్థానిక యర్రముక్కపల్లెలోని గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేష్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్. వెంకటరమణకు పుస్తకాలను అందజేశారు. సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం బహూకరించిన పుస్తకాల్లో శ్రీ వాల్మీకి మహర్షి ప్రణీతమ్, శ్రీమద్రామాయణమ్, (యుద్ధకాండం) ముకుందమాల భక్తితత్వం, శ్రీ సింహాద్రి నారసింహ శతకం, మాతృదర్శనం, టూకీగా ప్రపంచ చరిత్ర, సిరికోన భారతి, మహాభారతానుశీలనం, శ్రీమద్‌భాగవతం, నవమస్కంధం, గృహవైద్యం, హృదయం నీ నామం, శ్రీ అరుణాచలేశ్వరం, తెలుగు వ్యాకరణం తదితర గ్రంథాలున్నాయన్నారు. కాగా గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన సుబ్రహ్మణ్యంను వైవీయూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది అభినందించారు.

విద్యుత్ ఆదా సమష్టి బాధ్యత : ఎస్ఈ

కడప నాగరాజు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆదా సమష్టి బాధ్యతని జిల్లా విద్యుత్ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. శుక్రవారం జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు ఇందన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కడప మున్సిపల్ గ్రౌండ్ నుంచి అప్సర సర్కిల్ వరకు, డివిజన్ విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ వాడకాన్ని ఆదా చేసేందుకు ఇందన పరిరక్షణ చిట్కాలైన స్టార్ రేటెడ్ గృహ ఉపకరణాలు, లైట్లు వాడకంలో జాగ్రత్తలు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మిషన్ తదితర ఉపకరణాల వాడకంలో మెలకువలు గురించి తెలిపారు. విద్యుత్ ఆదా చేయడంతో ఇందన డిమాండ్ తగ్గి తద్వారా బొగ్గు, చమురు, గ్యాస్ వాడకం తగ్గి వాతావరణంలో కర్బన రసాయన కాలుష్యాలను తగ్గించవచ్చని తెలిపారు. సౌరవిద్యుత్ ఉత్పత్తిని అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుని భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అనంతరం విద్యుత్ ఆదాపై ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ సాగించారు. కార్యక్రమంలో ఈఈ హరిసేవ్యానాయక్, మధుసూదన్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.నరసింహారెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హుస్సేన్, డీలు, ఏఈలు, జేఈలు, అకౌంట్స్ విభాగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో స్టిక్కర్స్ ఆవిష్కరణ

కడప మారుతీనగర్, డిసెంబరు 20, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో కార్గో డోర్ డెలివరీ స్టిక్కర్లు, బ్యానర్లను జోన్ ఈడీ చంద్రశేఖర్, కడప రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆర్టీసీలో సరుకు రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడాలన్నారు. కడప డిపో మేనేజర్ ఢిల్లేశ్వరరావు, వివిధ డిపోల అధికారులు, యూనియ న్ నేతలు పరుషోత్తం, కె.కె. కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణలో జాగ్రత్తలు చేపట్టాలి

సికెదిన్నె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంటల రక్షణలో రైతులు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. బుగ్గలపల్లెలో శుక్రవారం రైతులు తాము సాగు చేసిన పంటలను సందర్శించారు. 27వ తేదీ కేంద్ర మంత్రి డాక్టర్ ఉపేంద్రసింగ్ పర్యటన సందర్భంగా పంచాయతీలో ఏర్పాట్లను పరిశీలించి రైతుల పంటపొలాలను చూశారు. రైతులు చేపట్టాల్సిన జాగ్రత్తలు గురించి పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఓ ఈశ్వర్‌రెడ్డి, ఉద్యానశాఖాధికారి జ్యోతిర్మయి, రైతు సేవా కేంద్రం అధికారి రేఖ, రైతులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ కోసం భూమిపూజ

పెండ్లిమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్షేత్రమైన పొలతలలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఆలయ ఈఓ కృష్ణనాయక్, టీడీపీ నేత సిరిగి రాజారెడ్డి భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పుత్రా చైతన్యరెడ్డి, కలెక్టర్ ఆదేశాల మేరకు టవర్ ఏర్పాటు చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

సచివాలయాల తనిఖీ

ఎర్రగుంట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో వెంకటరమణయ్య సచివాలయాల ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం తిప్పలూరులోని సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. హాజరు పట్టీలతోపాటు బయోమెట్రిక్ తదితర వాటిని పరిశీలించారు. రికార్డులను తనిఖీచేసి తగిన ఆదేశాలిచ్చారు. సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బయోమెట్రిక్‌ను పాటించాల్సిందేనన్నారు.

కష్టం రైతులది.. ఫలితం దళారులది..!

రైతు బజార్‌లేక అన్నదాతలు, కొనుగోలు దారులకు పాట్లు ● గిట్టుబాటుకాక రైతుల అవస్థలు
● దళారీ చెప్పిందే ధర ● రోడ్లపైనే క్రయవిక్రయాలు ● ట్రాఫిక్‌కు ఇబ్బందులు

బద్వేలు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టపడి పండించిన పంటను నేరుగా కొనుగోలు దారులకు విక్రయిస్తే తగినగిట్టు బాటు ధర లభించే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల బాధలేకుండా తక్కుధరకే నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు సామాన్యులకు లభిస్తాయి. దీని వల్ల ఇరువురికి లాభం ఉంటుంది. రైతు బజార్‌లేకపోవడంతో రైతు బేజార్ చెందుతున్నాడు.

సమాజంలో కష్టపడ్డవాడు బాగుపడతాడోలేదోకానీ, దళారీమాత్రం రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. ఏ విషయంలో నైనా సరే దళారి వ్యవస్థ ప్రథమస్థానంలో నిలిచి సమాజంలో అన్నిరంగాల్లో నాటుకు పోయింది. అలాంటి దళారీ వ్యవస్థ రైతులు పండించే కూరగాయలపైన కూడా పంజా విసురుతోంది. కూరగాయలను మార్కెట్‌కు తెచ్చే రైతుల నుంచి కొనుగోలుచేసి మార్కెట్ బయటే దళారీ లు వ్యాపారం చేస్తుండటంతో నాలుగురోడ్ల కూడలి నుంచి పోరుమామిళ్లరోడ్డులోని జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల వరకు నిత్యం రాత్రి 7గంటల నుంచి 10గంటల వరకు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ఆదారిలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



బద్వేలు కూరగాయల మార్కెట్

రైతుల నుంచి దళారీల కొనుగోలు..: బద్వేలు చుట్టూ రైతులు తాము పండించిన కూరగాయలను విక్రయించేందుకు పట్టణం లోని నాలుగురోడ్ల కూడలి సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్ వద్దకు వస్తారు. గతంలో మార్కెట్‌లోని దుకాణదారులకు విక్రయించడం, లేదంటే నేరుగా సామాన్యులకు విక్రయించేవారు. ప్రస్తుతం రాత్రి 7గంటలకు రైతులు కూరగాయల మార్కెట్ వద్దకు రాగానే దళారీలు రైతుల వద్ద నుంచి కూరగాయలను కొనుగోలుచేసి తమ వెంట తెచ్చుకున్న ఎల క్ట్రానిక్ కాటాల ద్వారా విక్రయాలను కొనసా గిస్తున్నారు. దీంతో రైతులనుకొని కూరగాయల ను కొనేందుకు వచ్చే ప్రజలతో పూర్తిగా ట్రాఫిక్ స్తంభించి ఆ రహదారిలో వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైతులు తాము పండించే కూరగాయలను గతంలో మార్కెట్‌కు తీసుకు వచ్చి రాత్రి 12 నుంచి తెల్లవారేలోపు దుకాణ దారులు లేదంటే ఇతరులకు విక్రయించి వెళ్లిపోయేవారు. అయితే రాను రాను సమయం రాత్రి 7గంటలకే మార్కెట్‌కు రావడంతో ఈ సమయాన్ని దళారులు వినియోగించుకొని రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకే కాయగూరలను కొని విక్రయాలు సాగిస్తూ దళారీలు లాభాలను ఆర్జిస్తున్నారు.

రైతు బజారు లేకపోవడమే సమస్య..:

బద్వేలు పట్టణం చుట్టూ గ్రామీణ ప్రాంతాల్లో కాయగూరలు, ఆకుకూరలను పండించే రైతులు ఉన్నారు. అయితే వారు తాము పండించిన కూరగాయలను హోల్‌సేల్ గాకానీ, రీటైల్‌గాకానీ అమ్ముకునేందుకు ఒక్కస్థానమంటూ(రైతు బజారు) ఇంత వరకు పాలకులుకానీ, అధికారులుకానీ ఏర్పాటు చేయలేకపోయారు. రైతు బజారును కానీ ఏర్పాటు చేసి ఉంటే రైతులు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా రైతులకు కాస్త ఆదాయంకూడా పెరిగి లాభాల్లో ఉంటారు. ఇప్పటికైనా దళా రుల చేతుల్లో మోసపోకుండా రైతు బజారు ఏర్పాటుచేస్తే మంచిదని పట్టణంలోని అన్నివర్గాల ప్రజలు, రైతన్నలు కోరుతున్నారు. కాగా ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్ ను వివరణ కోరగాట్రాఫిక్ కు అంతరాయం ఉన్నందున పోరుమామిళ్ల రోడ్డులో వ్యాపార కార్యకలా పాలు చేసే వారి కోసం మార్కెట్‌లోపల స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటాం.

అందుబాటులో ఆరోగ్య సేవలు

డాక్టరు రాజేష్‌కుమార్



ఇంటర్వ్యూ

చాపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టరు రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం రోగులకు సరిపడే విధంగా మందులు సరఫరా చేస్తున్నదని, అన్ని గ్రామాల ప్రజలు వైద్యంకోసం ఆస్పత్రికి వస్తున్నారన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజేష్‌కుమార్‌తో ఇంటర్వ్యూ..

ప్రశ్న: ఆస్పత్రిలో సిబ్బంది ఎంత మంది ఉన్నారు.
జవాబు: 14 మంది.
ప్రశ్న: ఎంతమంది డాక్టర్లు ఉన్నారు.
జవాబు: ఇద్దరు.
ప్రశ్న: ప్రతిరోజు ఓపీ ఎంత ఉంటుంది.
జవాబు: 90 నుంచి 110.
ప్రశ్న: ప్రభుత్వం మందులు కావాల్సినన్ని సరఫరా చేస్తున్నదా.
జవాబు: సరఫరా చేస్తున్నది.
ప్రశ్న: ఎలాంటి రోగులు ఎక్కువగా వైద్యం కోసం వస్తారు.
జవాబు: జలుబు, దగ్గు, జ్వరం, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు వస్తున్నారు.
ప్రశ్న: గ్రామాలకు ఎన్ని రోజులకు వెళతారు.
జవాబు: ప్రతి బుధవారం, శనివారం, 104 వాహనాల ద్వారా వెళతాం.
ప్రశ్న: గ్రామ సచివాలయాల్లో ఏఎన్ఎంలు ఎంత మంది ఉన్నారు.
జవాబు: 18 మంది ఉన్నారు.
ప్రశ్న: చిన్నపిల్లలకు రోగ నిరోధక శక్తి కోసం ఎలాంటి టీకాలు వేస్తారు.
జవాబు: బీసీజీ, ఓపీజీ టీకాలు వేస్తాం.
ప్రశ్న: గ్రామాల్లో పారిశుధ్యం ఎలా ఉంది.
జవాబు: కొన్ని గ్రామాల్లో బాగోలేదు.
ప్రశ్న: ప్రతిరోజు ఆస్పత్రికి ఎన్నిగంటలకు వస్తారు, మళ్లీ ఎన్నిగంటలకు వెళతారు.
జవాబు: ఉదయం 9 గంటలకు వచ్చి మళ్లీ మధ్యాహ్నం నాలుగు గంటలకు వెళ్లిపోతాం.
ప్రశ్న: మండలంలో జనాబా, చిన్నారులు ఎంత మంది ఉన్నారు.
జవాబు: జనాబా 42 వేలు, 0-5 చిన్నారులు 2 వేల మంది ఉన్నారు.
ప్రశ్న: పాము, తేళ్లు, కుక్క, జెర్రి కాటుకు మందులు ఉన్నాయా.
జవాబు: ఉన్నాయి.
ప్రశ్న: రోజుకు ఆస్పత్రిలో ఎన్ని గంటలు రోగులకు సేవలు అందిస్తున్నారు.
జవాబు: 24 గంటలు సేవలు అందిస్తాం.

రేపు 7వ తరగతి
విద్యార్థులకు ట్యాలెంట్ టెస్ట్

కాశినాయన డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి):శ్రీనివాసన్ రామానుజం జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు పిట్టిగుంట ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులకు ట్యాలెట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గానుగపెంట రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అకాడమీ పుస్తకాల్లోని సిలబస్ ప్రకారం గణితం, ఫిజిక్స్‌కెమిస్ట్రీలో ఉంటుంది.ఈపోటీల్లో కాశినాయన, పోరుమామిళ్ళకలసపాడు, బీ.కోడూరు మండలాల్లోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు.విజేతలకు ప్రధమ బహుమతి రూ.5000,ద్వితీయ బహుమతిరూ.2500, తృతీయ బహుమతి రూ.1000 ఉంటుందన్నారు.

విద్యార్థి అదృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని రామిరెడ్డిపల్లె రోడ్డులో డాక్టర్ జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న వెంకటహిమవంతు (15) పాఠశాల వద్ద నుంచి వెళ్లిపోయి కనిపించడంలేదని శుక్రవారం సాయంత్రం విద్యార్థి తండ్రి మురళి ఫిర్యాదు చేశారు. విద్యార్థి మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామానికి చెందినవాడు. ఈనెల 18వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో పక్కనే ఉన్న రూములో ఉన్న మునిశివ అనే విద్యార్థితో గొడవ పడ్డాడు. వాచ్‌మెన్ మునిరాజు ఇద్దరినీ మందలించి హిమవంతు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. 19వ తేదీ ఉదయం పరీక్ష రాసిన అనంతరం కాంపౌండ్ దూకి పారిపోయినట్లు, ఈ విషయంపై ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, విద్యార్థి తల్లిదండ్రులతో అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి

● టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆర్టీసీ బస్టాపుల వద్ద ఉన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కోరినట్లు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం విజయవాడలో మంత్రిని భూపేశ్‌రెడ్డి కలిసి మాట్లాడారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో భూపేశ్‌రెడ్డి మాట్లాడి ఆర్టీసీ బస్టాండుకు సంబంధించి కొండాపురంలో సమస్య ఉందని చెప్పారు. అలాగే వెంటనే మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్పందించి త్వరలోనే కొండాపురం బస్టాండుకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పినట్లు తెలిపారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు



కళాశాల కరస్పాండెంట్, అధ్యాపకులను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గీతాశ్రమంలోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలకు న్యాక్ బి++ గుర్తింపు లభించిందని కళాశాల కరస్పాండెంట్ ఎ.హరినారాయణ తెలిపారు. బుధవారం న్యాక్ గుర్తింపు లభించిన సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కరస్పాండెంట్, అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో న్యాక్ బి++ సాధించిన మొదటి కళాశాల ఎస్వీ డిగ్రీ కళాశాల అని తెలిపారు. కరస్పాండెంట్ హరినారాయణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు మంచి విద్యను అందించడానికి మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.

నెలాఖరులోగా
వడ్డీలేని పన్నులు చెల్లించండి

బద్వేలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ లోగా ఇంటిపన్నులు, కుళాయి పన్నులు వడ్డీలేకుండా చెల్లించవచ్చని బద్వేలు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పులువురు మొండి బకాయి దారులకు నోటీసులు జారీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అలాగే సక్రమంగా పన్నులు చెల్లించని 100 మంది జాబితాను తయారు చేసి వారికి రెడ్ నోటీసులు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే పన్నులు వసూలు చేసే సిబ్బంది కూడా ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అలాగే ఆయా సచివాలయాలలోను పన్నులు చెల్లించే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది రఘునాథరెడ్డి, ఆర్ఐ షఫి పాల్గొన్నారు.

ఆటో గంగమ్మకు దాతల చేయూత



గంగమ్మకు బియ్యం ప్యాకెట్లు, నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

కొండాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆటో గంగమ్మకు దాతలు కూడా సహకరిస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన బతుకుభారమై... ఆటో నడుపుతూ కథనంపై విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే గంగమ్మ ఆటో తెచ్చుకోవడానికి రుణం ఇస్తామని అధికారులు తెలిపారు. కాగా గిరిజన మహిళ గంగమ్మ బతుకుబండి నడిపేందుకు దాతలు కూడా తమ వంతు సహాయం అందిస్తున్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణానికి చెందిన మరియా ఫౌండేషన్ తరుపున గంగమ్మకు మూడు బియ్యం ప్యాకెట్లు, నెలకు సరిపడ నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పామిలేటి, రాజు, జయాకర్, గిరిజన నేత దేరాజ్యోతి పాల్గొన్నారు.

మందుబాబుల వీరంగం

బద్వేలుటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణంలోని మైదుకూరురోడ్డు గౌరీసాయి వైన్‌షాపు వద్ద మద్యం తాగి మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో మందుబాబులు ఒకరిపై ఒకరు దాడి చేసుకొని రాళ్లను విసురుకొని కత్తులతో దాడులు చేసుకోవడంతో ఒక్కసారిగా అక్కడి ప్రజలు భయాందోళనకు గురైన ఘటన బద్వేలు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గౌరీసాయి వైన్‌షాపు వద్ద మద్యం బాబులు మందు తాగి మాటా మాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

స్కూటర్‌పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

కాశినాయన డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం సమీపంలో శుక్రవారం రాత్రి స్కూటీపై ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి తలకు రక్తగాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాలమేరకు వరికుంట్ల గ్రామానికి చెందిన బసిరెడ్డి కల్లూరి వెంకటరెడ్డి కుమారుడు దుగ్గిరెడ్డి పోరుమామిళ్ళ నుంచి స్కూటీపై వరికుంట్లకు పోతుండగా ఓబుళాపురం సమీపంలో స్కూటీ అదుపుతప్పి కిందపడింది. ఈప్రమాదంలో దుగ్గిరెడ్డి తలకు గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు క్షతగాత్రుడిని పోరుమామిళ్ళలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దుగ్గిరెడ్డి శబరిమలైకి పోయి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి పోతూ ప్రమాదానికి గురైనట్లు సమాచారం.

దాల్మియా బాధిత రైతులకు న్యాయం చేయాలి

● ఆర్డీవోను కలిసిన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలం దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ పక్కన కొన్ని గ్రామాల రైతులు ఇబ్బంది పడుతున్నారని, వారికి శాశ్వత పరిష్కారంతోపాటు న్యాయం జరగాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి శుక్రవారం ఆర్డీవో సాయిశ్రీని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ దాల్మియా సిమెంటు పరిశ్రమపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరజ్‌కుమార్‌ప్రసాద్ ఉత్తర్వులుజారీ చేశారన్నారు. ఈ మేరకు వెంటనే ఆర్డీవో సాయిశ్రీని కలిసి సమస్యలు వివరించడం జరిగిందన్నారు. ఈ కమిటీలో ఆర్డీవో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పి.గిరిధర్‌రెడ్డి, ఫయాజ్‌బాష, వెంకటరామిరెడ్డి, దాల్మియా బాధిత రైతులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

బద్వేలు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు చేపడుతామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓహోంలో సబ్‌డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వైజరీకమిటీ సమావేశాన్ని నిర్వహించారు.డాక్టర్లు వి.నయ్‌కుమార్, శ్రీనివాసులు, శరత్‌చంద్ర, సౌమ్య, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంగయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

జమ్మలమడుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మూడో శనివారం విద్యుత్తు అంతరాయం ఉంటుందని సబ్‌డివిజన్ విద్యుత్తు అధికారి రాజగోపాల్ తెలిపారు. జమ్మలమడుగు మండలంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంటు ఉండదన్నారు. అలాగే మైలవరం, పెద్దముడియం మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంటు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

పెద్దముడియం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో 2023-24 సంవత్సరానికి గాను జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ శుక్రవారం ముగిసింది.ఈ కార్యక్రమానికి పీడీ ఆదిశే షారెడ్డి, ఏపీడీ రామలింగేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో షంషాద్‌బాను, ఇతర అధికారులు హాజరయ్యారు. సుమారు 32354 రూపాయల అక్రమాలు చోటు చేసుకున్నట్లు నివేదికను సభ ముందు ఉంచారు.ఏపీవో వెంకట సుబ్బయ్య ఇతర ఉపాధి అధికారులు ఈసీలు, పీఏలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం తగదు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమానపరిచే విధంగా మాట్లాడడం తగదని రాష్ట్ర మాలమహానాడు రామాజి వర్గం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుద్ధపల్లి మురళీప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సంగటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య డిమాండ్ చేశారు. మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, హరి పాల్గొన్నారు.

● అమిత్‌షా వ్యాఖ్యలపై రాష్ట్ర మాలమహానాడు జాకట విజయ్‌శేఖర్ ఆధ్వర్యంలో పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సంఘం రాయలసీమ అధ్యక్షుడు జేష్ఠాది భాస్కర్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దృశ్యం